
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY 5



శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

శనివారం 17 మే 2025

వినతుల వెల్లువ

మంత్రి నారా లోకేశ్ ప్రజాదర్బార్



6



నేడు జేఎన్‌టీయూ స్నాతకోత్సవం



6



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేశ్

రెన్యూతో ఎనర్జీ విప్లవం

ఇది పరిశ్రమే కాదు.. ఉద్యమం కూడా..!

ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

బేతాపల్లి వద్ద రెన్యూ ప్రాజెక్టుకు శంకుస్థాపన

రెన్యూ పవర్ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు శంకుస్థాపన దేశంలో క్లీన్ ఎనర్జీ విప్లవానికి పునాది రాయి అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. గుత్తి మండలం బేతాపల్లి సమీపంలో రూ.22 వేల కోట్లతో ఏర్పాటు చేస్తున్న 4.8 గిగా వాట్ల హైబ్రిడ్ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుకు ఆయన శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ చారిత్రాత్మక ఘట్టంలో తాను భాగస్వామ్యంకావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఇది పరిశ్రమ మాత్రమే కాదని, ఒక ఉద్యమమని అన్నారు. రెన్యూలో ఉత్పత్తి అయ్యే ప్రతి మెగా వాట్ విద్యుత్ ప్రపంచానికి ఒక సందేశం ఇస్తుందని అన్నారు. దీనికి సీఎం చంద్రబాబుకు ఉన్న బ్రాండ్ ప్రధాన కారణమని లోకేశ్ అన్నారు. (వివరాలు మెయిన్, 6లో)

నాణ్యతలో రాజీ పడొద్దు

జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

హంద్రీనీవా కాలువ పనుల పరిశీలన



మలకవేముల వద్ద హంద్రీనీవా కాలువ పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ముదిగుబ్బ/తనకల్లు, మే 16(ఆంధ్రజ్యోతి): నాణ్యతలో రాజీ పడకుండా హంద్రీనీవా కాలువ పనులు చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని మలకవేముల సమీపంలో హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని, క్యూరింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జూన్ నెలాఖరులోగా హంద్రీనీవా మొదటిదశ పనులు పూర్తి చేస్తామన్నారు. పనుల కోసం రూ.3,873 కోట్లకు పరిపాలన అనుమతులు వచ్చాయన్నారు. 2020 నాటికే హంద్రీనీవా పనులు పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికిన వైసీపీ ప్రభుత్వం తట్ట మట్టి కూడా తీయలేదని ఎద్దేవా చేశారు. కనీసం కరెంటు బిల్లులు కూడా చెల్లించలేదన్నారు. రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయనంత ద్రోహం, అన్యాయం జగన్ రాయలసీమకు చేశాడన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వర్‌రావ్, ప్రాజెక్ట్ సీఈ నాగరాజు, ఎస్ఈ రాజస్వరూప్, ధర్మవరం ఆర్డీవో మహేష్, ఇరిగేషన్ అధికారులు మురళి, శ్రీనివాసులు, వెంకటేశులు, మునీర్‌బాషా, రమేష్‌బాబు, అసిఫ్ హుస్సేన్, రవితేజ, షబానా పాల్గొన్నారు.

లైనింగ్ పనుల పరిశీలన

తనకల్లు మండలంలోని కొక్కంటిక్రాస్ వద్ద హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. అనంతపురం ఉమ్మడి జిల్లానుంచి చిత్తూరు ఉమ్మడి జిల్లాకు వెళ్తూ మార్గమధ్యలో ఆగి పనులను పరిశీలించారు. అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. త్వరగా పనులు చేపట్టాలని సూచించారు.

క్రమబద్ధీకరం



ప్రభుత్వ స్థలంలో నివాసాల క్రమబద్ధీకరణలో జాప్యం

జీవో నెంబరు 30 అమలుపై అధికారుల అలసత్వం

ఆక్రమిత స్థలాలపై పేదలకు ఉచిత రిజిస్ట్రేషన్

ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలం

డివిజన్‌లో ఇప్పటి వరకు మూడే దరఖాస్తులు

కదిరి ఆర్డీవో కార్యాలయం



కదిరిఅర్బన్, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసుకున్న నివాసాల క్రమబద్ధీకరణ విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవడంతో దరఖాస్తుల సంఖ్య తక్కువగా ఉంది. చాలా చోట్ల ప్రభుత్వ భూముల్లో పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకుని, చాల కాలంగా ఉంటున్నారు. ఇలాంటివారికోసం రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్- 2025ను తీసుకువచ్చింది. ఈ పథకం ద్వారా స్థలాల క్రమబద్ధీకరణకు ఈఏడాది జనవరిలో జీవో నెంబర్ 30ని జారీ చేసింది. అయితే అధికారుల అలసత్వంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. కదిరి డివిజన్ పరిధిలో అనేక ప్రాంతాల్లో నిరుపేదలకు ఇండ్లస్థలాలు లేకపోవడంతో ప్రభుత్వం భూముల్లో రేకుల షెడ్లు, పూరిళ్లు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి వారు ఏళ్ల తరబడి రెగ్యులరైజేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. క్రమబద్ధీకరణ ద్వారా పేదలకు ప్రభుత్వ స్థలంపై హక్కు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఆమేరకు విడుదల చేసిన జీవో క్షేత్రస్థాయికి రాకుండా కాగితాలకే పరిమితమైందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

అవగాహన ఏదీ?

అధికారులు క్రమబద్ధీకరణ అంశం గురించి ప్రజలకు ఎలాంటి అవగాహనా కల్పించలేదు. ఆర్డీవో, తహసీల్దార్, సచివాలయ కార్యాలయాల వద్ద ఇందుకు సంబంధించిన పోస్టర్లుకానీ, సమాచారం కానీ లేదు. ప్రజలకు అవగాహన కల్పించి ప్రభుత్వ ఆశయాన్ని నేరవేర్చేలా అధికారులు కృషి చేయాల్సిన అవసరముంది. డివిజన్ వ్యాప్తంగా ఇప్పటివరకు తమ స్థలాలు క్రమబద్ధీకరించాలని మూడు దరఖాస్తులు వచ్చాయంటే, అధికారుల అలసత్వం ఎంత ఉందో అర్థమవుతోంది.

విధి విధానాలు ఇవే..

ఆక్రమిత ప్రభుత్వ భూముల్లో అభ్యంతరం లేని నివాస స్థలానికి సంబంధించి, 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు. దారిద్రరేఖకు దిగువన ఉండి, 150 నుంచి మూడువందల గజాలలోపు ఉన్న స్థలానికి బేసిక్ ధరలతో 15 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 50శాతం చెల్లించాలి. దారిద్రరేఖకు ఎగువనున్నవారు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

మూడు వందల నుంచి 450గజాల స్థలానికి బీపీఎల్ కుటుంబాల వారు వందశాతం బేసిక్ ధర, 50శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంది. దారిద్రరేఖకు ఎగువనున్నవారు రెండువందల శాతం బేసిక్ ధర, పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. 450 గజాలకు మించిన స్థలాన్నిఆక్రమించి ఎవరున్నా బేసిక్ ధరకు ఐదురెట్లు, వంద శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంటుంది. దీనికి సిద్ధంగా లేకుంటే ఆస్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది.

అర్హులు వీరే...

గ్రామాల్లో గరిష్ఠంగా నెలకు రూ.పదివేలు, పట్టణాల్లో రూ.14వేలలోపు ఆదాయమున్నవారు నివాస స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. దరఖాస్తుదారుడికి నాలుగు చక్రాల వాహనాలుండకూడదు. నెలకు రూ.మూడు వందలలోపు మాత్రమే విద్యుత్ బిల్లు వస్తుండాలి. మెట్ట, మాగాణి కింది పదిఎకరాలకు మించి వ్యవసాయభూమి ఉండకూడదు. లేఅవుట్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ గట్లు, మాస్టార్ ప్లాన్, జలవనరులకు సంబంధించిన స్థలాల క్రమబద్ధీకరణకు అవకాశముండదు. ప్రభుత్వ స్థలాల్లో 2019 అక్టోబరు 15కన్నా ముందు నిర్మించుకున్న ఇళ్లనే క్రమబద్ధీకరించనున్నారు.



అర్హులు దరఖాస్తు చేసుకోవాలి: వీవీఎస్ శర్మ, ఆర్డీవో

ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నవారు నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకోవచ్చు. నిబంధనల మేరకు పరిశీలించి, రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పిస్తాం. ఈఏడాది డిసెంబరు 31వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశముంది.

సిందూర్ విజయంతో దేశ భద్రతపై నమ్మకం

● మంత్రి సవిత ● పెనుకొండలో ర్యాలీ



జాతీయజెండాతో ర్యాలీ చేస్తున్న మంత్రి సవిత, నాయకులు

పెనుకొండ టౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో దేశ భద్రతపై నమ్మకం మరింత బలపడిందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా పట్టణంలో శుక్రవారం జాతీయ జెండాలు పట్టుకుని పెద్దఎత్తున ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటుచేసి, వీరమరణం పొందిన సైనికుల కోసం మౌనం పాటించారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న ప్రతి సైనికుడికి కృతజ్ఞతలు అన్నారు. భారత సైనికుల సాహసాన్ని తెలియజెప్పేందుకు ర్యాలీ నిర్వహించామన్నారు. దేశానికి రణక్షగా ఉన్న సైనికులకు ప్రజలు ఎల్లవేళలా అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సతీష్‌కుమార్, సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్పపాల్గొన్నారు.

వైసీపీలో నైరాశ్యం..!

పుట్టపర్తి కౌన్సిల్ భేటీకి సభ్యులు దూరం

పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం



సమస్యలు పరిష్కారం కావట్లేదని ఆవేదన

కనీస గౌరవం లేదన్న అసంతృప్తి

చైర్మన్, అధికారులపై తీవ్ర అసహనం

చేసిన పనులకు బిల్లులురాక అప్పులపాలు

పుట్టపర్తి, మే 16(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి వైసీపీలో నైరాశ్యం ఆవరించింది. ఆ పార్టీ కౌన్సిలర్లు తీవ్ర నిస్పృహలో ఉన్నారు. వార్డుల్లో సమస్యలు పరిష్కారం కావట్లేదు. వీధిలైట్లు వేసేవారు కూడా లేరు. సొంత నిధులతో పనులు చేస్తే బిల్లులు రావు. దీంతో అప్పులపాలే. ఇన్నీ చేసినా.. అధికారుల వద్ద కనీస గౌరవం కరువాయె. వెరసి.. వైసీపీ కౌన్సిలర్లు కనీసం కౌన్సిల్ భేటీకి కూడా దూరంగా ఉంటున్నారు. గత నెలాఖరులో నిర్వహించిన సమావేశానికి మొత్తం 13 మంది వైసీపీ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. చైర్మన్ తుంగా ఓబుళపతి మాత్రమే వచ్చారు. టీడీపీ సభ్యులు హాజరైనా కోరంలేక వాయిదా పడింది. ప్రజాసమస్యలపై చర్చించడానికి వైసీపీ సభ్యులే రాకపోతే ఎలా అని టీడీపీ సభ్యులు నిలదీశారు.

కనీస గౌరవం కరువు

వైసీపీ కౌన్సిలర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గతేడాది వరకు తమ పార్టీనే అధికారంలో ఉన్నా.. ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. వార్డుల అభివృద్ధి సంగతి దేవుడెరుగు, సమస్యల పరిష్కారానికి నిధులు కరువయ్యాయంటున్నారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలుపుకోలేకపోతున్నామని చెబుతున్నారు. చిన్నచిన్న సమస్యలు కూడా పరిష్కరించలేని దుస్థితిలో ఉన్నామంటున్నారు. ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన చెందుతున్నారు. అంతటితో ఆగకుండా తమను చిన్నచూపు చూస్తున్నారని వైసీపీ సభ్యులు పేర్కొంటున్నారు. సమస్యలు పరిష్కరించేనపుడు, కనీస మర్యాద కరువైనపుడు కౌన్సిల్ భేటీలు ఎందుకని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు సమస్యలపై నిలదీస్తుంటే సొంత నిధులతో పరిష్కరించామనీ, వాటి బిల్లులు కూడా రాక అప్పుల పాలై, ఆస్తులను అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించిందని వారు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కౌన్సిల్ సమావేశానికి రావడం దండగన్న ఉద్దేశంతోనే దూరంగా ఉంటున్నట్లు వైసీపీ కౌన్సిలర్లు ఆవేదన వెలిబుచ్చారు.



లెక్కచేయని అధికారులు

పుట్టపర్తి మున్సిపాలిటీలో అధికారులు చెప్పిందే వేదమన్నది ఇక్కడి పరిస్థితులు చూస్తుంటే తెలుస్తోంది. కౌన్సిలర్లకు కనీస విలువ ఇవ్వట్లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అన్నిస్థాయిల అధికారులు పెత్తనం చెలాయిస్తూ అవినీతిలో మునిగి తేలుతున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పని కావాలంటే కౌన్సిలర్లు కూడా చేయి తడపాల్సిందేనన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2, 4, 6, 7 వార్డులతోపాటు ఎగువ ప్రాంతాల్లో సైతం నీటి సమస్య తలెత్తడం, మోటార్లు కాలిపోయినపుడు అధికారయంత్రాంగం పట్టించుకోకపోవడంతో సంబంధిత కౌన్సిలర్లే సొంత డబ్బు వెచ్చించి, మరమ్మతులు చేయించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఒక్కొక్కరు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు వెచ్చించి, బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు. అధికార యంత్రాంగం మాత్రం నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు సాగిస్తున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. అధికారులు, బిల్డర్ల మధ్య లోపాయికారీ ఒప్పందం కుదరడమే అందుకు కారణమన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వైసీపీ కౌన్సిలర్లు అసమ్మతి రాగం వినిపిస్తున్నారు. సొంత పార్టీ చైర్మన్‌పైనే అసంతృప్తి వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

● డీఈఓ కిష్టప్ప



కరపత్రాలను విడుదల చేస్తున్న డీఈఓ

కొత్తచెరువు, మే 16(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు డీఈఓ కిష్టప్ప శుక్రవారం తెలిపారు. ఈమేరకు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరుతూ స్థానిక డీఈఓ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, యూనిఫాం తదితర వాటిని అందిస్తోందన్నారు. ఈ ఏడాదిప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలోనే 10వ తరగతిలో అత్యధిక మార్కులు వచ్చాయన్నారు. ఈమేరకు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఏడీ లాజర్, రామలింగారెడ్డి, ఉపాధ్యాయులు అమరాచంద్రబాబు, జయప్రసాద్, రవి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో అసంబద్ధతలను తొలగించాలి

పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా క్రిష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న మిట్టా క్రిష్ణయ్య

ధర్మవరం, మే 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల్లో ఉన్న అసంబద్ధతలను తొలగించాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా క్రిష్ణయ్య కోరారు. స్థానిక సాయికృప జూనియర్ కళాశాలలో శుక్రవారం పీఆర్టీయూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీల చట్టంలో ఉన్న అసంబద్ధమైన విషయాలు తెలియజేస్తూ ఉపాధ్యాయుల విస్తృత ప్రయోజనాల దృష్ట్యా చట్టంలో మార్పు చేయాలని కోరారు. ఎస్సీ టీచర్లకు సెమీ మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లలో హెచ్ఎంలుగా స్కూల్ అసిస్టెంట్‌లను నియమించరాదని, ఎస్‌జీటీలను ఎల్ఎఫ్ఎల్ ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలని, స్కూల్ అసిస్టెంట్‌ల స్థాయిని దిగజార్చకుండా వారిని ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలో మాత్రమే నియమించాలన్నారు. ఉన్నతపాఠశాలలో విద్యార్థుల సంఖ్య 45దాటితే సెక్షన్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులసంఖ్య 85కు చేరితే మూడో సెక్షన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్ జిల్లా బదిలీలు, మోడల్‌స్కూల్ బదిలీలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. 2025 డీఎస్సీకి హాజరవుతున్న వారికి టెట్ రాయడానికి అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు ఆర్‌సీ విజయ్‌కుమార్, నాయకులు శివారెడ్డి, మొయిద్దీన్, సాలేహ, నారాయణస్వామి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీకి 233 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మే 16(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా జరిగిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు 233 మంది విద్యార్థులకు గైర్హాజరైనట్లు డీఐఈఓ సయ్యద్‌మౌలా శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం ఇంటర్ పరీక్షలను 4071 మంది రాయాల్సి ఉండగా 3887 మంది హాజరయ్యారు. 184 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షలు 831 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 782 మంది రాశారు. 49 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

రూ.25 లక్షల చెక్కు అందజేత

వీరజవాన్ కుటుంబానికి వైసీపీ ఆర్థికసాయం

గోరంట్ల, మే16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కళ్లితండాకు చెందిన వీరజవాన్ మురళీనాయక్ కుటుంబానికి రూ.25లక్షల ఆర్థికసాయాన్ని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ చెక్కు రూపంలో శుక్రవారం అందించారు. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కళ్లితండాకు వచ్చి దేశ సరిహద్దులో వీర మరణం పొందిన మురళీనాయక్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆ సందర్భంగా రూ.25లక్షల ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈక్రమంలోనే ఉషా శ్రీచరణ్ కళ్లితండాకు వెళ్లి వీరజవాన్ తల్లిదండ్రులైన శ్రీరామనాయక్, జ్యోతిబాయికి చెక్కును అందించారు. వీర జవాన్ కుటుంబానికి వైసీపీ అండగా ఉంటుందన్నారు. ఆమె వెంట జడ్పీటీసీ సభ్యుడు పాలే జయరామనాయక్, సర్పంచ్ వాసునాయక్, పోతల రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.



జవాన్ తల్లిదండ్రులకు చెక్కును అందజేస్తున్న ఉష శ్రీచరణ్

హంద్రీనీవాతోనే అభివృద్ధి

● కృష్ణానదిపై సిద్దేశ్వరం అలుగు నిర్మించాలి ● జలసాధన సమితి నాయకుల డిమాండ్



ర్యాలీగా వస్తున్న రైతు సంఘం జలసాధన సమితి నాయకులు

హిందూపురం, మే 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా అభివృద్ధికి హంద్రీనీవా ప్రాజెక్టు ఒక్కటే శరణ్యమని జలసాధన సమితి నాయకులు పేర్కొన్నారు. స్థానిక పెన్షనర్స్ భవన్‌లో తాగునీటి సమస్యలు.. పరిష్కార మార్గం అనే అంశంపై శుక్రవారం సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమం జలసాధన సమితి, రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో జరిగింది. దేశంలోనే ఉమ్మడి అనంతపురం జిల్లా కరువు ప్రాంతంగా పేరుపొందిందన్నారు. రైతుల ఆత్మహత్యలు కూడా ఇక్కడే అధికంగా ఉన్నాయన్నారు. ఇలాంటి జిల్లాకు హంద్రీనీవా ప్రాజెక్టుతోనే సాంత్వన చేకూరుతుందన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం హంద్రీనీవా ప్రాజెక్టు నిర్దేశించిన ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తోందన్నారు. జీడిపల్లి నుంచి కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ పనులు మాత్రమే చేయడం దారుణమన్నారు. కృష్ణానదిపై సిద్దేశ్వరం అలుగు నిర్మించాలన్నారు. ఈ నెల 31న కృష్ణానది సంగమేశ్వరం వద్ద బహిరంగసభ ఏర్పాటు చేశామని దీనికి నాయకులు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకటరామిరెడ్డి, జలసాధన సమితి నాయకులు గంగిరెడ్డి, ఓపీడీఆర్ శ్రీనివాసులు, నవీన్, జమీల్, ఆదినారాయణ, అమానుల్లా, కార్మిక సంఘం నాయకులు రవికుమార్, బాబావలి, పీడబ్ల్యుఎస్‌యు నాయకులు బాబావలి, లక్ష్మీనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో వినతుల వెల్లువ

పరిష్కరిస్తాం: మంత్రి నారా లోకేశ్



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న మహిళలు

గుత్తి, మే 16(ఆంధ్రజ్యోతి): స్థానిక అనంతపురం రోడ్డులో రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వినతులు వెల్లువెత్తాయి. మండలంలోని ధర్మాపురం గ్రామానికి రోడ్డు గుంతలమయమైందనీ, కొత్తగా నిర్మించాలని మాజీ సర్పంచ్ శ్రీనివాస్ చౌదరి కోరారు. గుంతకల్లు పట్టణానికి చెందిన గోరంట్ల నాగరాజు 2024లో రోడ్డు ప్రమాదంలో వెన్నెముక డిస్క్‌లు విరిగి, శరీరం స్పర్శ లేకుండా పోయి, కాళ్లు, చేతులు పనిచేయక బెంగళూరులో రూ.18 లక్షలదాకా ఖర్చు చేశామన్నారు. అయినా నయం కాలేదనీ, వైద్యానికి, మందులకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు నారా లోకేశ్ దృష్టికి తీసుకొచ్చారు. ఆర్థికంగా ప్రభుత్వం సాయం చేయాలని కోరారు. సీఎం రిలీఫ్ ఫండ్ అందించాలని విన్నవించారు. వంశపారంపర్యంగా సక్రమించిన భూమిని కబ్జాదారులు ఆక్రమించారని, తనకు న్యాయం చేయాలని పట్టణానికి చెందిన రంగనాయకులు కోరారు. గుంతకల్లు మండలం నెలగొండ గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.16 లక్షలు స్వాహా చేశారని సింగాడి శ్రీనివాసులు.. మంత్రికి ఫిర్యాదు చేశాడు. పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ, ఐటీ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. గుంతకల్లు పట్టణంలో పాలిటెక్నిక్ కళాశాలకు స్థలం కేటాయించి నూతన భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్.. మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ అమలు చేయాలనీ, సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలనీ, 9 రకాల పాఠశాలలను సవరించి పాత విద్యావిధానాన్ని అమలు చేయాలని ప్రతి పాఠశాలలో విద్యార్థులతో సంఖ్యతో సంబంధం లేకుండా ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలనీ, 12వ పీఆర్సీ కమిషన్ నియమించి, మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని మంత్రిని కోరారు. అనేక మంది బాధితులు.. తమ సమస్యలపై మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. వాటిని స్వీకరించిన మంత్రి లోకేశ్ పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి లోకేశ్







రెన్యూ ఇండియా స్టోరీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు లోకేశ్, గొట్టిపాటి రవి, సంస్థ చైర్మన్ సుమంత్ సిన్హా, కలెక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే జయరాం, సభలో ప్రసంగిస్తున్న మంత్రి నారా లోకేశ్, హాజరైన ప్రజలు, టీడీపీ నాయకులు

ఉద్యోగ కల్పనే రెన్యూ లక్ష్యం

- సీఎం చంద్రబాబుపై నమ్మకంతో ఏపీ వైపు కంపెనీల చూపు
- స్థానికంగా పదివేల మందికి ఉద్యోగావకాశాలు
- సోలార్ విద్యుత్ ప్రాజెక్టుతో కరెంటు చార్జీలు తగ్గిస్తాం
- 'రెన్యూ' ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేశ్

గుంతకల్లు, మే16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ కల్పనే లక్ష్యంగా రెన్యూ హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టును తెచ్చామని విద్య, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. గుత్తి మండలం బేతాపల్లి వద్ద సోలార్ విద్యుత్ ప్రాజెక్టుకు మంత్రి శనివారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సు లో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా ఉన్న 20 లక్షల ఉద్యోగాల కల్పనలో భాగంగానే ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ సోలార్ విద్యుత్ ప్రాజెక్టులో రెన్యూ విద్యుత్ కంపెనీ రూ. 22,000 కోట్లు పెట్టుబడి పెడుతోందన్నారు. దీంతో అనంతపురం జిల్లాలో 10 వేల ఉద్యోగాల కల్పన జరుగుతుందన్నారు. చంద్రబాబు నాయుడిపై నమ్మకంతో ఇప్పుడిప్పుడే భారీ కంపెనీలు ఏపీ వైపు వస్తున్నాయన్నారు. గడచిన ఐదేళ్లలో ఒక్క మెగావాట్ విద్యుదుత్పత్తి సంస్థ, ఒక్క బ్యాటరీ స్టోరేజి సిస్టం వ్యవస్థ కూడా రాలేదన్నారు. ఇటువంటి పవర్ ప్రాజెక్టుల ద్వారా గత ప్రభుత్వ హయాంలో ప్రజలపై పడిన విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని రానున్న రోజుల్లో తగ్గిస్తామన్నారు. ఏపీలో ఉత్పత్తి చేయనున్న విద్యుత్ రానున్న రోజుల్లో యావత్ భారత దేశానికి ఉపయోగపడుతుందన్నారు. విజన్ ఉన్న నేత ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో హైబ్రిడ్ రెన్యువబుల్ పవర్ ప్రాజెక్టులాంటివి మరిన్ని రాష్ట్రానికి తెస్తామన్నారు. ప్రధాని కారణంగానే రాయలసీమకు పవర్ ప్రాజెక్టు వచ్చిందని, త్వరలో కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అప్పుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీని రాయలసీమ గడ్డపైకి కూడా రప్పిస్తామన్నారు. గడచిన ఐదేళ్లలో రోడ్లు కాదు, రోడ్లపై పడిన గుంతలను కూడా పూడ్చలేకపోయారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే తాము అన్ని మార్గాలను అన్వేషించి పెట్టుబడులను తేవడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రాజెక్టుకు వ్యవసాయ భూములను ఇచ్చిన రైతులకు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వినోద్ కుమార్, నెడ్‌క్యాప్ ఎండీ కమలాకర్ బాబు, లేబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున, రాయల్ రామయ్య, వీరేశ్, చిప్పగిరి ప్రతాప్, పెంచలపాడు వెంకటేశులు పాల్గొన్నారు.



ఎక్స్‌కవేటరుతో పవర్ ప్రాజెక్టు పనులను ప్రారంభిస్తున్న లోకేశ్

వెళ్లిపోయిన పెట్టుబడులు వెనక్కు వస్తున్నాయి

విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్



గత ఐదేళ్లలో వెనక్కు వెళ్లిపోయిన పెట్టుబడిదారులందరూ తిరిగి ఏపీకి వస్తున్నారని విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ ప్రాజెక్టు శంకుస్థాపనా సభలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్లే కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయన్నారు. రాయలసీమకు చెందిన జగన్ ఇక్కడి ప్రజలకు చేసిన మేలు ఒక్కటీ లేదన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాటైన 11 నెలల్లోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నో కంపెనీలను రాష్ట్రానికి తెచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారన్నారు.

రైతులు, యువతకు మేలు: ఎమ్మెల్యే గుమ్మనూరు



రెన్యూ సోలార్ విద్యుత్ ప్రాజెక్టు వల్ల స్థానిక యువత, రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. బేతాపల్లి వద్ద ఏర్పాటుచేసిన హైబ్రిడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు శంకుస్థాపనా సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ ప్రాంతంలో మెట్ట భూములలో పంటలు పండితే ఎకరాకు రూ. 20 వేల నుంచి రూ. 25 వేలదాకా మాత్రమే రైతులకు మిగులుతోందన్నారు. అటువంటిది రెన్యూ విద్యుత్ కంపెనీ రైతులకు ఎకరాకు రూ.35 వేల లీజు చెల్లించడానికి ముందుకు వచ్చిందంటే అది అదృష్టమనే చెప్పాలన్నారు. ఈ ప్రాజెక్టు స్థాపన వల్ల స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.

పవన, సోలార్ విద్యుదుత్పాదనకు ఏపీ అనుకూలం: సుమంత్ సిన్హా



పవన, సోలార్ విద్యుదుత్పాదనకు రాష్ట్రంలో అనువైన ప్రదేశాలు ఉన్నందుకే తాము ఇక్కడ ప్రాజెక్టును నిర్మించడానికి ముందుకు వచ్చామని రెన్యూ విద్యుత్ కంపెనీ చైర్మన్, సీఈఓ సుమంత్ సిన్హా పేర్కొన్నారు. ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమం తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెట్టుబడులకు ఏపీ అనుకూలమైన విధానాలను అనుసరిస్తోందని తెలిపారు. ట్రాన్స్‌మిషన్ కనెక్టివిటీ ఇక్కడ మెండుగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు చొరవ కారణంగానే తాము ఏపీ పట్ల సానుకూల దృక్పథంతో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చినట్లు తెలియజేశారు. 78.5 గిగావాట్ల సౌర విద్యుత్తు, 35 గిగా వాట్ల పవన విద్యుత్తు, 25 గిగా వాట్ అవర్ బ్యాటరీ శక్తి నిల్వను ఉత్పత్తి చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రాజెక్టు నిర్మాణం చేయనున్నట్లు వివరించారు.



మంత్రి లోకేశ్‌తో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు..



లోకేశ్‌తో ముచ్చటిస్తున్న మంత్రి సవిత

పెళ్లిలో సందడి

అనంతపురం, మే16(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కూతురు శ్రీచరిత, ఆయన వియ్యంకుడు ముత్తినేని రాజగోపాల్ కుమారుడు రాహుల్ ఆదిత్య వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతపురం నగర శివారులో జరిగిన వివాహ వేడుకలకు బంధుమిత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రముఖులు, జిల్లా ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలు, టీడీపీ శ్రేణులు తరలివచ్చారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు, కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న, శాసన సభ సభాపతి అయ్యన్నపాత్రుడు, మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, సవిత, అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ హాజరై.. నూతన దంపతులను ఆశీర్వదించారు. మాజీ మంత్రులు కామినేని శ్రీనివాసరావు, అమర్‌నాథ రెడ్డి, పల్లె రఘునాథ రెడ్డి, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణి శ్రీ, ఎంఎస్ రాజు, గుమ్మనూరు జయరాం, కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, టీడీపీ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు, ముఖ్యనేతలు ఎద్దుల సుబ్రహ్మణ్యం, తలారి ఆదినారాయణ, గౌస్‌మొహిద్దీన్, స్వరూప తదితరులు నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.



నూతన దంపతులు, వారి కుటుంబ సభ్యులతో మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే గుమ్మనూరు, ఎంపీ బీకే





ఆడిటోరియం లోపల ఏర్పాట్లు

నేడే పట్టాల పండుగ



స్నాతకోత్సవ రిహార్సల్స్

జేఎన్‌టీయూ స్నాతకోత్సవానికి సర్వం సిద్ధం

ముస్తాబైన ఎన్టీఆర్ ఆడిటోరియం

హాజరుకానున్న గవర్నర్

అనంతపురం సెంట్రల్, మే 16(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ 14వ స్నాతకోత్సవం శనివారం అట్టహాసంగా నిర్వహించనున్నారు. వేడుకలకు వర్సిటీ చాన్సిలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. స్నాతకోత్సవంలో విద్యార్థులకు బంగారు పతకాలు, పట్టాలను గవర్నర్ ప్రదానం చేస్తారు. వీసీ సుదర్శనరావు, వర్సిటీ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమర్ ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ, వైద్య శాఖల అధికారులు ఏర్పాట్లను పూర్తిచేశారు. స్నాతకోత్సవానికి వేదికైన ఎన్టీఆర్ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం కాన్వకేషన్ రిహార్సల్స్ నిర్వహించారు. శనివారం ఉదయం 10 గంటలకు వేడుకలు ప్రారంభంకానున్నాయి.

40,109 మందికి పట్టాలు

జేఎన్టీయూ 14వ స్నాతకోత్సవంలో 40,109 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేయనున్నట్లు వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, అకడమిక్, ఆడిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ దుర్గాప్రసాద్‌తో కలిసి వీసీ వివరాలు వెల్లడించారు. బీటెక్, బీఫార్మసీ పూర్తిచేసిన 30,017 మంది విద్యార్థులకు అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను అందజేస్తామన్నారు.

ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంసీఏ, ఎంబీఏ పూర్తిచేసిన 9,564 మందికి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు, 361 మందికి ఫార్మా-డి పట్టాలను అందజేస్తామన్నారు. 167 మందికి పీహెచ్‌డీ పట్టాలను ప్రదానం చేస్తామన్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో కోర్సులు పూర్తి చేసి ప్రతిభ కనబరచిన డిగ్రీ విద్యార్థులకు 40, పీజీ విద్యార్థికి ఒకటి మొత్తం 41 గోల్డ్ మెడల్స్ అందజేస్తామన్నారు. అనంతపురం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి ఆరు, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థిని సుప్రజ నాలుగు గోల్డ్‌మెడల్స్‌కు ఎంపికయ్యారన్నారు.

వర్సిటీ ముస్తాబు..

స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ హాజరవుతుండడంతో జేఎన్‌టీయూ పరిసరాలు ముస్తాబయ్యాయి. కలెక్టరేట్ వద్దనున్న వైజంక్షన్ రోడ్డు నుంచి జేఎన్‌టీయూ ప్రాంగణం వరకు చిన్మయ గ్రామ పంచాయతీ, నగరపాలక సంస్థ కార్మికులు శుభ్రంచేశారు. వైద్యసిబ్బంది మెడికల్ ఎమర్జెన్సీ ఏర్పాట్లను చేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలో పదుల సంఖ్యలో పోలీసుసిబ్బంది భద్రత కల్పించనున్నారు. గవర్నర్‌కు స్వాగత ఏర్పాట్లు, సేదతీరేందుకు గెస్ట్ హౌస్ తదితర ప్రక్రియలను డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు, రూరల్ మండల తహసీల్దార్ మోహన్‌కుమార్ పర్యవేక్షించారు.

ప్రధానిని కలిసేందుకు మంత్రి..

జేఎన్టీయూ స్నాతకోత్సవానికి గవర్నర్‌తోపాటు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యునికేషన్స్, రియల్-టైమ్ గవర్నెన్స్ మంత్రి నారా లోకేశ్ పాల్గొనేందుకు జిల్లా యంత్రాంగం షెడ్యూల్‌ను ఖరారుచేసింది. దేశ ప్రధాని నరేంద్ర మోదీని కలిసేందుకు మంత్రి లోకేశ్‌కు అపాయింట్‌మెంట్ సమాచారం అందడంతో.. ఆయన ఢిల్లీకి పయనమై వెళ్లారని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

స్నాతకోత్సవం సాగేదిలా..

- ఉదయం 10 నుంచి 10.15 గంటల వరకు జేఎన్‌టీయూ వీసీ, పాలకమండలి సభ్యులు, రిజిస్ట్రార్, ప్రిన్సిపాళ్లు స్నాతకోత్సవ వేదిక వద్దకు చేరుకుని, అకడమిక్ రోబ్స్‌ను ధరిస్తారు.
- 10.25 నుంచి 10.48 గంటల వరకు గౌరవ డాక్టరేట్ గ్రహీత, ముఖ్య అతిథులతోపాటు చాన్సిలర్ అయిన రాష్ట్ర గవర్నర్‌కు వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు స్వాగతం పలుకుతారు. అనంతరం వారు అకడమిక్ రోబ్స్‌ను ధరిస్తారు.
- 10.50 నుంచి 10.57 వరకు గ్రూప్ ఫొటో దిగి, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను ఊరేగింపుగా వేదికపైకి తీసుకెళ్లి, జాతీయ గీతాన్ని ఆలపిస్తారు.
- 10.59 నుంచి 11.10 గంటల వరకు రాష్ట్ర గవర్నర్ స్నాతకోత్సవాన్ని ప్రారంభిస్తారు. అనంతరం వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు స్వాగత ప్రసంగంచేసి, జేఎన్‌టీయూ అభివృద్ధి నివేదికలను సమర్పిస్తారు.
- 11.10 నుంచి 11.15 గంటల వరకు గౌరవ డాక్టరేట్‌కు ఎంపికైన డాక్టర్ సత్యనారాయణ ప్రసంగిస్తారు. అనంతరం ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తారు.
- 11.15 నుంచి 11.30 గంటల వరకు విద్యార్థులకు బంగారు పతకాలు, డిగ్రీలను గవర్నర్ ప్రదానం చేస్తారు.
- 11.50 గంటల వరకు స్నాతకోత్సవ ముఖ్య అతిథిగా ఐఐటీ కాన్పూర్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంఆర్ మాధవ్ ప్రసంగిస్తారు.
- 12.05 గంటల వరకు చాన్సిలర్ హోదాలో గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ స్నాతకోత్సవ ప్రసంగం చేస్తారు. అనంతరం గవర్నర్‌కు జ్ఞాపిక అందజేసి, సత్కరిస్తారు.
- 12.13 గంటల వరకు జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య ధన్యవాద తీర్మానం చేస్తారు. అనంతరం స్నాతకోత్సవ ముగింపునకు చాన్సిలర్ అబ్దుల్ నజీర్ అనుమతికోరుతూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు ప్రసంగం చేస్తారు.
- 12.15 గంటల వరకు స్నాతకోత్సవానికి హాజరైన వారందరూ జాతీయ గీతాన్ని ఆలపిస్తారు.
- 12.15 గంటలకు గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ వేడుకల నుంచి నిష్క్రమిస్తారు.

పోలీసులు అలర్ట్..

ఎంపీపీ ఎన్నిక నేపథ్యం

గ్రామాల్లో విస్తృత తనిఖీలు



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ శ్రీధర్

రామగిరి, మే 16(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మండలంలో ఊరూరా కలియతిరుగుతూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 19వ తేదీన రామగిరి ఎంపీపీ ఎన్నిక నిర్వహించనుండడంతో పోలీసులు గ్రామాల్లో విస్తృత పర్యవేక్షణ చేపట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గురువారం రాత్రి సీఐ శ్రీధర్ పేరూరు, కొత్తపల్లి, గంగంపల్లి తదితర గ్రామాల్లో విస్తృతంగా తిరిగారు. కొత్తపల్లిలో ఎంపీటీసీ-2 ఇంటికి తాళాలు వేసి ఉండటంతో గ్రామంలో ఆయన కలియతిరిగారు. అక్కడ వైసీపీకి చెందిన ఓ నాయకుడికి బెదిరింపులు వచ్చాయని తెలియడంతో ఆయనను కూడా విచారించారు. గ్రామస్థులతో సమావేశం ఏర్పాటుచేసి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదని తెలిపారు. ఏ చిన్న సమస్య ఉన్నా.. గొడవ జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో రెచ్చగొట్టేలా ప్రవర్తించవద్దనీ, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైసీపీ ఎంపీటీసీలున్న గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచారు.

క్రైం కార్నర్

బాబాయ్.. అబ్బాయ్.. చోరీలు

● ఆలయాలే లక్ష్యం.. ● పోలీసులకు చిక్కిన నిందితులు



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ వంశీకృష్ణ

కళ్యాణదుర్గం, మే 16(ఆంధ్రజ్యోతి): బాబాయ్.., అబ్బాయ్.. వ్యసనాల బారిన పడ్డారు. వాటిని తీర్చుకునేందుకు డబ్బు కోసం చోరీల బాట పట్టారు. అదికూడా ఆలయాలనే లక్ష్యంగా చేసుకున్నారు. పలు ఆలయాల్లో చోరీలు చేశారు. ఆఖరుకు పోలీసులకు చిక్కి, కటకటాల పాలయ్యారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి తులం బంగారం, 4.50 కేజీల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం సీఐ వంశీకృష్ణ.. దొంగల అరెస్టు వివరాలను వెల్లడించారు. ధర్మవరంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన ఆవుల రాజశేఖర్, అతడి చిన్నాన్న గొల్ల బొబ్బిలి వ్యసనాలకు బానిసలయ్యారు. వాటిని తీర్చుకునేందుకు చోరీలను ఎంచుకున్నారు. ఆలయాలే లక్ష్యంగా చోరీ లు మొదలెట్టారు. కళ్యాణదుర్గం మండలంలోని మల్లిపల్లి చౌడేశ్వరి, బోయలపల్లిలో మారెమ్మ, కంబదూరు మండల పరిధి కదిరిదేవరపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి, తిమ్మాపురం వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాల్లో చోరీకి పా ల్పడ్డారు. ఆలయాల తాళాలు పగులకొట్టి లోపలికి ప్రవేశించేవారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేసేవారు. హుండీలను కూడా పగులకొట్టి అందులోని నగ దు, బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. చోరీలపై కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. శుక్రవారం రాజశేఖర్, గొల్ల బొబ్బిలిని అరెస్టు చేసి, ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

బొలెరో వాహనం బోల్తా

● ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

తాడిపత్రి, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇగుడూరు గ్రామ సమీపంలో శుక్రవారం బొలెరో వాహనం బోల్తాపడిన సంఘటనలో చాంద్ బాషా (40) మృతిచెందగా, మరో ముగ్గురు గాయపడ్డారని ఎస్ఐ కాటయ్య తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన చాంద్‌బాషా, హుస్సేన్‌బాషా, యర్రగుంట్లకు చెందిన అంజనేయులు, గంగప్రతాప్ జీవాల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈక్రమంలోనే బళ్లారిజిల్లా హోస్పేట్ సమీపంలోని కుంకుమపల్లె వద్ద 40పొట్టేళ్లను తీసుకొని ప్రొద్దుటూరుకు బయలుదేరారు. ఇగుడూరు సమీపంలోకి రాగానే టైరుపగిలి వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో చాంద్‌బాషా అక్కడికక్కడే మృతిచెందాడు. అంజనేయులు, హుస్సేన్ బాషా, గంగప్రతాప్ స్వల్పంగా గాయపడ్డారు. వారిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య షేక్ రియాజీ, ఒక కుమారుడు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ కాటయ్య సిబ్బందితో కలిసి పరిశీలించారు.

లారీని ఢీకొట్టిన ఐచర్.. డ్రైవర్ మృతి

పెద్దవడుగూరు, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుత్తిఅనంతపురం గ్రామ సమీపంలోని ఎన్‌హెచ్-44 జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని శుక్రవారం తెల్లవారుజామున ఐచర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హర్యానా రాష్ట్రంలోని మేవాత్ జిల్లాకు చెందిన లారీ డ్రైవర్ ఇమ్రాన్ (38)మృతి చెందాడు. హర్యానాకు చెందిన లారీ బెంగళూరుకు వెళుతుండగా బ్రేక్ డౌన్ అవడంతో రోడ్డు పక్కన ఆపారు. దాన్ని తమిళనాడుకు చెందిన ఐచర్ వెనుకవైపు నుంచి ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన లారీ డ్రైవర్ ఇమ్రాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు...

తాడిపత్రి, మే 16(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడు ఓబయ్య(35) మృతి చెందిన సంఘటన శుక్రవారం పట్టణంలో జరిగినట్లు హెడ్‌కానిస్టేబుల్ నరసింహనాయుడు తెలిపారు. శ్రీనివాసపురానికి చెందిన ఓబయ్య భవన నిర్మాణంలో కూలి పనులు చేసుకుంటూ జీవించేవాడు. అందులో భాగంగా కాల్వగడ్డ వీధిలో నిర్మిస్తున్న భవనానికి సంబంధించి కడ్డీలను కట్ చేసి పైకి ఎత్తి తీసుకువెళుతున్న సమయంలో విద్యుత్ లైనుకు కడ్డీలు తగిలాయి. దీంతో విద్యుత్ సరఫరా అయి ఓబయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య నాగేశ్వరితోపాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఆటో బోల్తా - ఒకరి మృతి

పామిడి, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామరాజుపల్లి సమీపాన 44వ జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడి శైలు(15) మృతి చెందగా మరో నలుగురు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ప్యాపిలి పట్టణానికి చెందిన నాగేంద్ర, రాధమ్మ దంపతులు తమ పిల్లలు శైలు, మోక్షిత, సుదర్శన్‌తో కలిసి ఆటోలో ఉరవకొండ మండలం పెన్నఅహోబిళం దేవస్థానానికి బయలుదేరారు. రామరాజుపల్లి సమీపంలో అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. క్షతగాత్రులను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మోస్తరు వర్షం

పుట్టపర్తి రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం రాత్రి ఓమోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా గుడిబండ 35.2 మి.మీ వర్షం కురవగా, అత్యల్పంగా అగళిలో 5.2 మిమీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. గాండ్లపెంట 20.0 మి.మీ, రొళ్ల 21.2 మి.మీ, మడకశిర 6.0 మి.మీ వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో చీనీ ధర మరింత పెరిగింది. చీనీకాయలు టన్ను గరిష్ఠంగా శుక్రవారం రూ. 35,100 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.6,200, సరాసరి రూ.22వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 545 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఏపీలో అభివృద్ధి పరుగులు

● నిధులు ఇస్తున్నాం.. అభివృద్ధి బాధ్యత మీదే
● రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న
● అనంత స్టేషన్ తనిఖీ



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న రైల్వే సహాయ మంత్రి సోమన్న

అనంతపురం న్యూటౌన్ మే 16 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ పరుగులు పెడుతోందని రైల్వే సహాయమంత్రి సోమన్న పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి శుక్రవారం వచ్చిన ఆయన స్థానిక ఎంపీ అంబిక లక్ష్మీనారాయణతో కలిసి స్థానిక రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. రైల్వే స్టేషన్‌కు వచ్చిన వారికి స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కావల్సినన్ని నిధులు కేటాయిస్తున్నాం. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాల్సిన బాధ్యత మీదేనని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాకు సూచించారు. అనంతరం వీఐపీ విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు విషయాలను ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో 73 రైల్వే స్టేషన్లలో అమృత్ పథకం కింద పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రాజమండ్రి, తిరుపతి, విశాఖపట్నం రైల్వే స్టేషన్ల అభివృద్ధికి వందల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతపురం రైల్వే స్టేషన్‌ను సైతం రూ.30 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఎస్కలేటర్ సౌకర్యం కలిగిన ఈ స్టేషన్‌ను 2026లోపు పూర్తి చేస్తామన్నారు.

మంత్రి సహకారంతోనే బెంగళూరుకు రైలు: ఎంపీ

మంత్రి సహకారంతోనే అనంతపురం నుంచి బెంగళూరుకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేయగలిగామని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొ న్నారు. ఈ ప్రాంతానికి మరిన్ని రైలు సర్వీసులు అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. ఢిల్లీకి వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను అనంతపురం స్టేషన్‌లో ఆపేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ధర్మవరం నుంచి మచిలీపట్నం వెళ్లే రైలును రాయలచెరువులో ఆపేలా చూడాలని కోరారు.

మరిన్ని నిధులు కేటాయించండి: ఎమ్మెల్యే

అనంతపురం రైల్వే స్టేషన్‌లో మరిన్ని సదుపాయాలు కల్పించేలా చూడాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కేంద్ర మంత్రిని కోరారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కోచ్‌లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సందిండి శ్రీనివాసులు, డీఎస్‌సీ మురళీకృష్ణ, ఏఎస్‌సీ అనిల్‌కుమార్, సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీఓఎం శ్రావన్, సీనియర్ డీఈఎన్ శ్రీనివాసులు, డీఈ ఎల్లయ్య, స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్, హెల్త్ఇన్‌స్పెక్టర్ మూర్తి, సీఐ సుధాకర్‌తో పాటు స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లింటికి చల్లటి కబురు..!

● కూతురు పెళ్లికి దాచిన బంగారం చోరీ
● కువైట్‌లో 20 ఏళ్లు కష్టపడి సంపాదించిన తండ్రి
● గత నెల 30న రాయచోటిలోని ఇంట్లో చొరబడ్డ దొంగ
● కణేకల్లు పోలీసులకు దొరికిన వైనం
● బాధితులకు కబురుపెట్టిన పోలీసులు



నిందితుడిని చూపుతున్న పోలీసులు

అనంతపురం క్రైం/రాయదుర్గం, మే 16(ఆంధ్రజ్యోతి): కుటుంబం కోసం అతను కువైట్ వెళ్లాడు. భార్య, పిల్లలకు దూరంగా 20 ఏళ్లకు పైగా గడిపాడు. కొవిడ్ సమయంలో భార్య, కొడుకు మృతిచెందారు. దీంతో అతను స్వదేశానికి తిరిగొచ్చాడు. తనకంటూ మిగిలిన ఒక్కగానొక్క కూతురు వివాహానికి ఏర్పాట్లు చేస్తున్నాడు. అప్పటి వరకూ కష్టపడి సంపాదించిన సొమ్ముతో కొన్న బంగారాన్ని తాకట్టు నుంచి విడిపించాడు. ఇంకో నెలలో పెళ్లి జరగాల్సి ఉండగా.. ఇంట్లో దొంగ పడి బంగారాన్ని దోచుకుపోయాడు. దీంతో ఆ తండ్రి హతాశుడయ్యాడు. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ తండ్రికి పోలీసులు చల్లటి కబురు అందించారు. 'ఒక దొంగను పట్టుకున్నాం. రికవరీ చేసిన బంగారంలో మీరు పోగొట్టుకున్నదీ ఉంది..' అన్నారు. అంతే.. ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.

ఇంతకూ ఏమిటా కథ..?

అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన విజయ్ భాస్కర్, క్రిష్ణవేణి దంపతులకు సాయి ప్రతాప్ నాయుడు, ప్రీతి సంతానం. ఆర్థిక ఇబ్బందుల కారణంగా 20 ఏళ్ల క్రితం విజయ్ భాస్కర్ కువైట్‌కు వెళ్లారు. అక్కడ రేయింబవళ్లు కష్టపడి సంపాదించిన సొమ్మును ప్రతి నెలా కుటుంబ సభ్యులకు డబ్బు పంపేవాడు. కొవిడ్ సమయంలో, 2021లో భార్య క్రిష్ణవేణి, కుమారుడు ప్రతాప్ మృతి చెందారు. దీంతో విజయ్‌భాస్కర్ రాయచోటికి తిరిగి వచ్చారు. కూతురుకు పెళ్లి కుదరడంతో బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను రెండు నెలల క్రితం ఇంటికి తీసుకొచ్చారు. మరో నెల రోజుల్లో పెళ్లి ఉండటంతో ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో గత నెల 30న విజయ భాస్కర్‌కు కంటి వైద్యం చేయించేందుకు కూతురు ప్రీతి వైద్యుడి వద్దకు తీసుకెళ్లింది. వారు తిరిగి వచ్చేలోగా ఇంట్లో చోరీ జరిగింది. మొత్తం 31 తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకుపోయారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో అనంతపురం జిల్లా కణేకల్లు పోలీసులు పీట్ల గంగాధర్ అలియాస్ సాంబ అనే అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేశారు. అతన్నుంచి 45.5 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అందులో విజయ్ భాస్కర్ ఇంట్లో చోరీ చేసిన 31 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఈ విషయాన్ని పోలీసులు బాధిత కుటుంబానికి తెలియజేశారు. ఆ కుటుంబం ఆనందంలో మునిగిపోయింది.

సామాన్యుడు కాదు..

పీట్ల గంగాధర్ వివిధ రాష్ట్రాల్లో తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేశాడని కణేకల్లు సీఐ వెంకటరమణ తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో ఎస్ఐలు నాగమధు, నబీరసూల్‌తో కలిసి ఆయన ఈ కేసు వివరాలను తెలిపారు. కణేకల్లు క్రాస్ వద్ద అతన్ని శుక్రవారం అరెస్టు చేసి, రూ.48 లక్షల విలువచేసే 45.5 తులాల బంగారు నగలు, 2.27 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన పీట్ల గంగాధర్, క్రికెట్ బెట్టింగ్, జూదానికి బానిసయ్యాడు. జల్సాలకు అలవాటు పడ్డాడు. డబ్బులకోసం చోరీలు చేసేవాడు. రాయదుర్గం, రాప్తాడు, గోరంట్ల, గాండ్లపెంట, బ్రహ్మసముద్రం, అనంతపురం, ఉరవకొండ, విడపనకల్లు, డోన్, పులివెందుల, రాయచోటి, తెలంగాణలోని వికారాబాద్, కొత్తకోట, ఆమనగల్లు, షాద్‌నగర్, కర్ణాటకలోని జగలూరు, బళ్లారి ప్రాంతాల్లో ఇతడిపై చోరీ కేసులు ఉన్నాయి. మొత్తం 40 కేసుల్లో నిందితుడు. కణేకల్లు క్రాస్‌లో పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు చేస్తుండగా.. గంగాధర్ అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని విచారించగా అంతర్రాష్ట్ర దొంగ అని తేలింది.

మీ ఊరికొస్తా... మీ ఇంటికైనా వస్తా

● హంద్రీనీవాపై బహిరంగ చర్చకు సిద్ధం
● వైసీపీ నేత శివరామిరెడ్డికి ప్రభుత్వ విప్ కాలవ సవాల్

అనంతపురం అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉరవకొండలోనే కాదు, మీ స్వగ్రామం కొనకొండ్ల లేదా... మీ స్వగృహంలోనైనా సరే హంద్రీనీవాపై బహిరంగ చర్చకు వస్తానని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు వైసీపీ నేత, ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి సవాల్ విసిరారు. స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణి శ్రీ, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్‌లతో కలిసి శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం హయాంలోనే హంద్రీనీవా పనులు వేగవంతంగా జరిగాయన్నారు. సీఎం చంద్రబాబు పాలనలో సీమలో సాగునీటి ప్రాజెక్టుల పనులు తిరిగి ప్రారంభమ వుతున్నాయన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో హంద్రీనీవా ప్రాజెక్టు పనులను పూర్తిగా తొక్కిపెట్టి, సీమ సాగునీటి రంగాన్ని సర్వనాశనం చేశారన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులుగా మాజీ సీఎం జగన్‌ను అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. సీఎం చంద్రబాబు చేస్తున్న మంచి పనులను మెచ్చుకోవాలన్న మనసు మీకులేకుంటే మౌనంగా ఉండాలని, అలాకాకుండా ఇష్టానుసారంగా మాట్లాడటం పద్ధతి కాదన్నారు. ఉత్తుత్తి ఉత్తర్వులతో ప్రజలను మోసం చేసినా సిగ్గులేని వైసీపీ నేతలు అనంత వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, శివరామిరెడ్డిలు ప్రస్తుతం సీఎం చంద్రబాబు హంద్రీనీవా పనులను పునఃప్రారంభించి, పరుగులు పెట్టిస్తుంటే విమర్శలు చేయడం శోచనీయమన్నారు. వారి విమర్శలకు సమాధానం ఇవ్వడానికి బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. శివరామిరెడ్డి ఉరవకొండలో చర్చకు రావాలని సవాల్ విసిరారని, ఆయన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నానన్నారు. అలాకాకుంటే ఈనెల 21, 22వతేదీల్లో ఉదయం 11 గంటలకు అనంతపురం ప్రెస్ క్లబ్‌లో తాను సిద్ధంగా ఉంటానని, నీవుగానీ, నీ తరఫున ఇతర నాయకులను ఎవరిని పంపించినా బహిరంగ చర్చకు తాను సిద్ధమేనని సవాల్ విసిరారు.



మీడియాతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

ఘనంగా ఎమ్మెల్యే అశ్మిత్ పుట్టినరోజు



ఎమ్మెల్యేకు గజమాల వేస్తున్న నాయకులు, కార్యకర్తలు

తాడిపత్రి, మే16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆయన నివాసం వద్దకు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకుని, శుభాకాంక్షలు తెలిపారు. గజమాలతో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి, పంచిపెట్టారు. అందరినీ ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేకి టీడీపీ సీనియర్ నాయకుడు, ఆయన సోదరుడు జేసీ పవన్‌రెడ్డి ప్రేమతో ఆలింగనం చేసుకుని, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు జగన్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

పైపులైన్ ప్రారంభం

పెన్నానది నుంచి నెహ్రూ పార్కు వరకు ఏర్పాటు చేసిన పైపులైన్‌ను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ పైపులైన్‌తో పోరాటకాలనీ, సీపీఐ కాలనీ, ఓంశాంతినగర్, బంకమడివీధి, సుంకులమ్మపాలెం తదితర ప్రాంతాల్లో నీటికొరత ఉండదన్నారు. అంతకుమునుపు ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం సర్వమత ప్రార్థనలు చేశారు. అనంతరం కొళాయి తిప్పి, నీటి సరఫరాను ప్రారంభించారు. ట్యాంక్ వద్ద మొక్కలు నాటారు. కాలనీవాసులకు విందు ఏర్పాటు చేశారు.



పైపులైన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఉపాధ్యాయుల ఉద్యమబాట...!

● 21న డీఈఓ ఆఫీస్ ముట్టడి
● ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక

అనంతపురం విద్య, మే 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 21న డీఈఓ ఆఫీస్ ముట్టడికి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు నిచ్చింది. రికగ్నైజ్, రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలన్నీ ఐక్యవేదికగా ఏర్పడి, సమస్యల పరిష్కారానికి పోరాటం చేసేందుకు సిద్ధమయ్యాయి. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం 117 జీవో రద్దు చేసి... ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టింది. ఇటీవల స్కూళ్ల పునర్నిర్మాణం, ఉపాధ్యాయ పోస్టుల పునర్విభజనకు నాంది పలికింది. ఇందులో భాగంగా ఇటీవల విద్యాశాఖ జీవోలు 19, 20, 21 విడుదల చేసింది. వీటిపై మెజార్టీ ఉపాధ్యాయులు, సంఘాల నేతలు అసంతృప్తిలో ఉన్నారు. సంఘాల నేతలిచ్చిన ప్రతిపాదనలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, అధికారులు అనుకున్నదే చేస్తూ ముందుకెళ్తున్నారన్న అసంతృప్తిలో సంఘాల నాయకులు ఉన్నారు. మంత్రి లోకేశ్ విద్యాశాఖలో సంస్కరణలు తేవాలన్న యోచనతో ఉంటే, రాష్ట్ర స్థాయిలో కొందరు అధికారులు మాత్రం స్కూళ్లపై వింత ప్రయోగాలు చేస్తూ, విపరీత ధోరణిలో ముందుకెళ్తున్నారన్న విమర్శలు సంఘాల నేతల నుంచీ వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం స్కూళ్లను 6 రకాలుగా మారిస్తే...ఈ ప్రభుత్వం 9 రకాలుగా మార్చిందంటూ ఉపాధ్యాయులు, నేతలు మండిపడుతున్నారు. ఈనేపథ్యంలోనే విజయవాడలో శుక్రవారం జరగాల్సిన ఉపాధ్యాయ సంఘాల సమావేశాన్ని కూడా ఇప్పటికే బహిష్కరించారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 21న ఉమ్మడి జిల్లాల డీఈఓ ఆఫీస్‌ల ముట్టడికి పిలుపునిచ్చినట్లు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

● మంత్రి లోకేశ్‌కు ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు వినతి



మంత్రి లోకేశ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న వెంకటశివుడు యాదవ్, పూల నాగరాజు

అనంతపురం కల్చరల్, మే 16(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఆర్టీసీలో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు కోరారు. ఈమేరకు శుక్రవారం అనంతపురానికి వచ్చిన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పూల నాగరాజు మాట్లాడుతూ... ఆర్టీసీ ఉద్యోగులను చిన్న చిన్న కారణాలకే సస్పెండ్ చేయడంతోపాటు విధుల నుంచి తొలగిస్తున్నారన్నారు. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి, ఆదుకోవాల్సిన అవసరముందన్నారు. అనంతరం టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నాయకులతో కలిసి నారా లోకేశ్‌కు జ్ఞాపికను అందజేసి, సత్కరించారు.

ఉద్యోగార్థులకు ఎస్కేయూలో వసతి

అనంతపురం సెంట్రల్, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం కోసం పరీక్షలకు సన్నద్ధమౌతున్న విద్యార్థులకు ఎస్కేయూలో ప్రత్యేకంగా వసతిని కల్పించినట్లు ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ తెలిపారు. వారు మాట్లాడుతూ ఈనెల 15నుంచి జూలై 10వరకు వర్సిటీ వేసవి సెలవులను ప్రకటించి హాస్టల్స్‌ను మూసివేసిందన్నారు. దీంతో తమ ప్రిపరేషన్‌కు ఇబ్బంది అవుతుందని డీఎస్సీ, కానిస్టేబుల్ ఉద్యోగాల పరీక్షలకు చదుతున్న విద్యార్థులు వీసీని కలిసి విన్నవించారు. భువన విజయం ఆడిటోరియం భవనంలో గదులను కేటాయించి చదుకునేందుకు ఆటంకంలేకుండా వసతి కల్పించినట్లు వీసీ వెల్లడించారు.

43 పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం: డీసీహెచ్ఎస్

అనంతపురం టౌన్, మే16 (ఆంధ్రజ్యోతి): వైద్యవిధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో ఖాళీ పోస్టుల భర్తీకి నిర్ణయం తీసుకున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టరు రవికుమార్ శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 43పోస్టులు భర్తీ చేయడానికి కలెక్టరు ఆమోదం తెలిపారన్నారు. ఇందులో రేడియోగ్రాఫర్-2, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులు04, ఆపరేషన్ థియేటర్02, రికార్డు అసిస్టెంట్ 02, ఆఫీస్ సబార్డినేట్-03, పోస్టుమార్టమ్ అసిస్టెంట్ 02, జనరల్ డ్యూటీ అటెండెంట్స్ 22, బయోమెడికల్ ఇంజనీర్, ఆడియో మెట్రిక్ టెక్నీషియన్, ఫిజియోథెరపిస్ట్, ప్లంబర్ ఒక్కో పోస్టు చొప్పున భర్తీ చేస్తామన్నారు. ఈనెల21 నుంచి 28వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తులను జిల్లాకేంద్రంలోని పాతూరు సీడీఆస్పత్రి ఆవరణలో ఉన్న డీసీహెచ్ఎస్ ఆఫీస్‌లో అందజేయాలన్నారు. ఈ పోస్టులకు సంబంధించిన సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.

24న పుట్టపర్తిలో మినీ మహానాడు

పుట్టపర్తి, మే16(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి టీడీపీ మినీ మహానాడు ఈనెల 24న పుట్టపర్తిలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప తెలిపారు. అనంతపురంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్, మాజీ మంత్రి పల్లెరఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా హిందూపురం పార్లమెంట్ స్థాయిలో మినీ మహానాడు నిర్వహణపై చర్చించారు. పుట్టపర్తిలో 24న నిర్వహించాలని తీర్మానం చేసినట్లు జిల్లా అధ్యక్షుడు అంజినప్ప తెలిపారు.

ఎయిడెడ్ స్కూళ్లలో 10 పోస్టులకు దరఖాస్తులు

అనంతపురం విద్య, మే 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెండు ఎయిడెడ్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న 10 టీచర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక రామచంద్రనగర్‌లోని సెయింట్ మేరీస్ బాలికల ఉన్నత పాఠశాలలో 5 పోస్టులు ఉన్నాయన్నారు. స్కూల్ అసిస్టెంట్ బయాలజీ, తెలుగు, లాంగ్వేజ్ పండిట్ తెలుగు, హిందీ, పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆర్‌సీఎం ఎయిడెడ్ ప్రైమరీ స్కూల్‌లో 5 ఎస్‌జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. జిల్లాలోని ఆసక్తి, అర్హత ఉన్న యువతీయువకులు ఈనెల 31వ తేదీలోగా పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ http://cse.ap.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

న్యూస్ బాక్స్

సార్వత్రిక సమ్మె 9కి వాయిదా



విలేకరులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ధర్మవరం, మే 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న జరగాల్సిన దేశ వ్యాప్త సమ్మె జూన్ 9వ తేదీకి వాయిదా వేసినట్టు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న తెలిపారు. ఈ మేరకు రైతుసంఘం కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల వల్ల వాయిదా వేశామని వివరించారు. దేశం ఇంత తీవ్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నా కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. సమావేశంలో నాయకులు ఎస్‌హెచ్ బాషా, మారుతి, హైదర్‌వలీ, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఈయూ కమిటీ ఎన్నిక



ఎన్నికయిన కమిటీ సభ్యులు

కదిరిఅర్బన్, మే 16(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కదిరి డిపో ఎంప్లాయిస్ యూనియన్‌కు నూతన కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు జీవైపీ రావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో జరిగిన డిపో ఎగ్జిక్యూటివ్ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు క్రిష్ణకుమార్, రాజశేఖర్, రాష్ట్రనాయకులు నబీరసూల్, నాగార్జున హాజరయ్యారన్నారు. డిపో అధ్యక్షుడిగా దివాకర్, కార్యదర్శిగా కొండారెడ్డి, వర్కింగ్ ప్రెసిండెంట్‌గా జీసీఎస్ నాయుడు, ఉపాధ్యక్షుడిగాగా జిలాన్, ప్రచార కార్యదర్శిగా హరికుమార్, ట్రెజరర్‌గా రవినాయక్‌తోపాటు మరో 13 మందిని సభ్యులుగా ఎన్నుకున్నామని వారు తెలిపారు.

మినీమహానాడును విజయవంతం చేయండి : పల్లె

పుట్టపర్తిరూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో ఈనెల 20న నిర్వహించే మినీమహానాడు కార్యక్రమానికి టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. పార్టీ పరిశీలకులు హాజరయ్యే కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల కన్వీనర్లు, పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు జాతీయ తిరంగ ర్యాలీ

జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం 4.30 గంటలకు మున్సిపల్ కార్యాలయం నుంచి విద్యాగిరి ఆర్చ్ వరకు నిర్వహించే జాతీయ తిరంగ ర్యాలీలో పాల్గొనాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, జనసేన ఇన్‌చార్జి పత్తిచంద్రశేఖర్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం వారు ఒక ప్రకటనలో కోరారు.

చికిత్స పొందుతూ టీడీపీ నాయకుడి మృతి



నల్లమాడ, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన టీడీపీ నాయకుడు శ్రీనివాసులు(48) శుక్రవారం మృతిచెందారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీనివాసులు ఆయన నివాసంలో బాత్‌రూమ్‌లో జారిపడ్డారు. వెంటనే కుటుంబసభ్యులు నల్లమాడ ప్రభుత్వ ఆసుపత్రికితరలించారు, ప్రథమ చికిత్సల అనంతరం అనంతపురం తరలించగా, చికిత్సలు పొందుతూ మృతి చెందారు. మృతుడికి తల్లిదండ్రులతోపాటు, భార్య కుమారి, ముగ్గురు కుమార్తెలు ఉన్నట్లు చెప్పారు. ఇంటి యజమాని మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

యువకుడిపై పోక్సో కేసు

బత్తలపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 14 సంవత్సరాల బాలిక అదృశ్యంపై సురేంద్ర అనే యువకుడిపై శుక్రవారం పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. బాలిక అదృశ్యమయినట్లు తల్లి ఫిర్యాదు చేయడంతో గురువారం రాత్రి నుంచి పోలీసులు గాలింపులు చేపట్టారు. తాడిమర్రి మండలం నార్సింపల్లికి చెందిన సురేంద్ర అనే యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి తీసుకెళ్లాడు. పోలీసులు గాలిస్తున్నట్లు తెలుసుకుని గురువారం రాత్రి బాలికను గ్రామంలో వదిలి వెళ్లాడు. తల్లి ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ధర్మవరంలో మంత్రి పర్యటన

ధర్మవరం, మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పర్యటించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం 10 గంటలకు స్థానిక ఇందిరమ్మ కాలనీలోరూ.3.30 కోట్లతో చేపట్టిన రోడ్లు, కాలువలు, రిజర్వ్ స్థలాలకు కంచె నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తారని వివరించారు. కొత్తపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సుందరీకరణలో భాగంగా అభివృద్ధి చేసిన బటర్‌ఫ్లై ఆర్ట్‌ను మంత్రి ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలి

ధర్మవరం, మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీజనల్ వ్యాధులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన పారిశుధ్య, ఆరోగ్య కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... మూడో శనివారం జరగబోయే స్వచ్ఛ ఆంధ్రా-స్వర్ణ ఆంధ్రా కార్యక్రమం గురించి వివరించారు. పట్టణంలో ఎక్కడైన అపరిశుభ్రత కనిపించరాదని, వీధులన్నీ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వార్డుల్లో చెత్తాచెదారాన్ని, మురికి నీటిని రోడ్లపైకి వేయరాదని ప్రజలకు సూచించాలని తెలిపారు.



సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్

యథేచ్ఛగా రేషన్ బియ్యం తరలింపు

● ఒకటో తేదీ వస్తే వ్యాపారులకు పండుగే ● పాలిష్ చేసి పక్కరాష్ట్రానికి తరలింపు ● పట్టించుకోని అధికారులు



ఆటోలో కదిరికి తరలిస్తున్న రేషన్ బియ్యం (ఫైల్), ద్విచక్రవాహనంలో రేషన్ బియ్యం తరలింపు

గాండ్లపెంట, మే 16 (ఆంధ్రజ్యోతి): పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యం యథేచ్చగా పక్క రాష్ట్రానికి తరలిపోతున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. గాండ్లపెంట మండలంలో రేషన్ బియ్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15వరకు వ్యాపారులకు పండుగలా మారుతోంది. చౌక ధాన్యపు దుకాణాల డీలర్లు పెద్దమొత్తంలో అమ్మేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మారుమూల గ్రామాల్లో పేదలకు పంపిణీ చేయకుండా.. లబ్ధిదారులతో వేలిముద్రలు వేయించుకుని, ఎగ్గొట్టిన సందర్భాలు ఉన్నాయి. అన్నీతెలిసినా అధికారులు చర్యలు తీసుకోలేదనే విమర్శలు ఉన్నాయి. వ్యాపారులు, డీలర్లతో కుమ్మక్కైనట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. మరికొందరు పేదల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని మిల్లులో పాలిష్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రేషన్ బియ్యాన్ని మారుమూల గ్రామాల నుంచి ద్విచక్రవాహనాల 100, 50 కిలోలు వేసుకుని కదిరికి తరలిస్తున్నట్లు సమాచారం. ఈ బియ్యాన్ని లబ్ధిదారుల వద్ద కిలో రూ.18 నుంచి రూ.20లోపు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. వాటిని కదిరి ప్రాంతంలో మిల్లులో కిలో రూ. 25 ప్రకారం విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. నిత్యం ద్విచక్రవాహనాల్లో బియ్యం తరలిస్తున్నా, ఒక్కరోజుకూడా అడ్డుకున్న అధికారులు లేరు. వ్యాపారులు ప్రతి శాఖకు మామూళ్లు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతినెలా 1వతేదీ వచ్చిందంటే మారుమూల గ్రామాల లబ్ధిదారుల నుంచి రేషన్ సేకరించి మిల్లులకు తరలిస్తున్నారు. ప్రధాన రహదారి కదిరి, రాయచోటి గుండా తరలుతున్నాయి. గతంలో రేషన్ బియ్యం హోటళ్లకు విక్రయించేవారు. ప్రస్తుతం రేషన్ బియ్యాన్ని మిల్లులో పాలిష్ పట్టి, ఇతర రాష్ట్రాలకు తరలిస్తే కిలో ధర రూ.50కిపైగా పలుకుతోంది. దీంతో వ్యాపారులు, మిల్లు యజమానులు యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలం నుంచి ఎక్కువ మంది వ్యాపారులు ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో కదిరిలోని మిల్లులకు తరలిస్తున్నారు. ద్విచక్ర వాహనాల్లో తీసుకెళ్లే వారిని ఎవరైనా ప్రశ్నిస్తే బియ్యాన్ని తమ సొంతానికి తీసుకెళ్తున్నామని బుకాయిస్తున్నారు. కొంతమంది అధికారులు వ్యాపారుల నుంచి మామూళ్లు తీసుకుని సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సీఎస్‌డీటీ రెవెన్యూ సిబ్బంది రేషన్ తరలింపుపై తనిఖీలు చేయక పోవడంతోనే వ్యాపారుల పని సులుభంగా మారుతోందనే విమర్శలు ఉన్నాయి. గతరెండు సంవత్సరాలుగా ఎలాంటి తనిఖీలు లేవు, కేసులు లేవు.

చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. అక్రమంగా తరలిస్తున్నవారిపై నిఘా ఉంచుతాం. బియ్యాన్ని తరలించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.

- వాణీబాయి, సీఎస్‌డీటీ, గాండ్లపెంట

గ్రామాల్లో ప్రశాంతత కోసమే పల్లెనిద్ర : ఎస్పీ



పల్లెనిద్రలో భాగంగా ప్రజలతో మాట్లాడుతున్న అర్బన్ సీఐ సునీత

పుట్టపర్తిరూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): పల్లె నిద్ర వంటి కార్యక్రమాలతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం, విజిబుల్ పోలీసింగ్‌తో ప్రజల భద్రతకు భరోసా కల్పించడమే లక్ష్యంగా జిల్లా పోలీసు యంత్రాంగం పనిచేస్తోందని ఎస్పీ రత్న శుక్రవారం ఓప్రకటనలో పేర్కొన్నారు. గురువారం రాత్రి జిల్లాలోని పుట్టపర్తి, కదిరి, హిందూపురం, ధర్మవరం, పెనుకొండ సబ్‌డివిజన్ పరిధిలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు తమ సిబ్బందితో గ్రామగ్రామాన గ్రామస్థులతో సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఆయా గ్రామంలో నెలకొన్న సమస్యలు, నేరాలు, నివారణ చర్యలు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో గొడవలకు దిగకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని, కార్‌డ్రైవర్లు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్వోబీ పనులను వేగవంతం చేయండి : జేసీ



ఆర్వోబీ పనులపై అధికారులతో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్

ధర్మవరం రూరల్, మే16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కదిరిగేట్ వద్ద జరుగుతున్న ఆర్వోబీ పనులను వేగవంతం చేయాలని, ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని ఆర్వోబీ పనులను పరిశీలించారు. ఆర్డీఓ మహేష్, సర్వేయర్‌తో కలిసి బ్రిడ్జి నిర్మాణ మ్యాపింగ్ పరిశీలించి, ఇళ్లు కోల్పోయిన బాధితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఆర్వోబీ పనులకు సహకరించిన ఇళ్ల బాధితులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పనులు వేగవంతంగా జరిగేలా తనిఖీలు చేసి త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా డివిజన్ పరిధిలో దీర్ఘకాలిక ఫైల్స్‌కు ముగింపు పలికేలా పనిచేయాలని ఆర్డీఓను ఆదేశించారు. కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కారించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ నటరాజ, సర్వేయర్ మంజుల, వీఆర్‌ఓలు తదిరులుపాల్గొన్నారు.

ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచాలి: డీఆర్వో



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో విజయసారథి

పుట్టపర్తిటౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడానికి రాజకీయ పార్టీలు తోడ్పాటు అందించాలని డీఆర్వో విజయసారథి కోరారు. ఓటరు జాబితా సవరణపై శుక్రవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్వో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, సవరణలకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. రాజకీయ పార్టీలు పోలింగ్ శాతం పెంపునకు సహకరించి, 18 సంవత్సరాలు దాటిన యువతీయువకులను ఓటరు జాబితాలో చేర్పించడానికి కృషి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల పెంపు ప్రక్రియలతో రాజకీయ పార్టీలు భాగస్వామ్యులు కావాలన్నారు. తమ ఏజెంట్ల ద్వారా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జాకీర్ హుస్సేన్, టీడీపీ నుంచి ఆదినారాయణ, కాంగ్రెస్ లక్ష్మీనారాయణ, జనసేన అబ్దుల్‌ఖాదర్, బీజేపీ భరత్‌కుమార్, సీపీఎం గంగాధర్, వైసీపీ నుంచి రవినాయక్ పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ఉండండి: డీఎస్పీ



బనాన్‌చెరువు గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి

గాండ్లపెంట, మే 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గొడవలకు దూరంగా ఉండాలని కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. మండలంలోని మల్లమీదపల్లి పంచాయతీ బనాన్‌చెరువుపల్లిలో శుక్రవారం డీఎస్పీ గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి కక్షలకు, గొడలకు పోకూడదన్నారు. విలువైన భవిష్యత్ ఇబ్బందిపాలవుతుందన్నారు. చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. అలాగే మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. ఆయనతోపాటు సీఐ నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంగాభవానీ కలశ పూజ



ప్రత్యేకాలంకరణలో గంగాభవాని

గాండ్లపెంట, మే 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన గంగాభవాని 17వ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం కలిశ పూజతో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా కలిశ పూజ, ప్రత్యేకాలంకరణ, అభిషేకం, అష్టోత్తర నామావలి, సాయంత్రం మహిళలచే లలిత సహస్రనామాలు, కుంకుమార్చన చేశారు. భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆయల కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. రాత్రి నిర్వహించిన చక్కభజన అలరించింది.

24న మండల సర్వసభ్య సమావేశం

కొత్తచెరువు, మే 16(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 24న మండల సర్వసభ్యసమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నటరాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో ఆప్షన్‌మెంబర్లు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

డెంగీ నివారణపై ర్యాలీలు

కదిరిఅర్బన్, మే 16(ఆంధ్రజ్యోతి): జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో శుక్రవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి టవర్‌క్లాక్ మీదుగా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. డెంగీ చాలా వరకు మాములు జ్వరమే అన్నారు. కొంతమందిలో ఇది ప్రాణాంతకంగా పరిణమిస్తోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● బుక్కపట్నం : డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని సిద్దరాంపురంలో వైద్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామమోహన్‌నాయుడు, సర్పంచ్ రమణయ్య, వైద్య సిబ్బంది మురళి, రాధ, అనిల్ కుమార్, అబిద్ పాల్గొన్నారు.

● ధర్మవరం : ప్రజల్లో డెంగీ వ్యాధి గురించి అవగాహన కలిగించాలని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ మాధవి పేర్కొన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చెన్నారెడ్డి, పీపీ యూనిట్ వైద్యులు సురేశ్‌నాయక్, శ్రావణి, మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరాం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

● ముదిగుబ్బ : మండల పరిధిలోని మలకవేముల ప్రాథమిక ఆ రోగ్య కేంద్రం సిబ్బంది డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రోజా, ఎంపీహెచ్‌ఈఓ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

● పుట్టపర్తిరూరల్ : ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలంటే ప్రజలందరూ తమ ఇంటితో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి జోత్స్న, డాక్టర్ మునిచంద్రిక పేర్కొన్నారు. డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నగేష్, ఎస్‌యూఓ రమణయ్య, సూపర్‌వైజర్ చంద్రకళ సిబ్బంది పాల్గొన్నారు.



కదిరి, పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యఆరోగ్య సిబ్బంది

రేపు కదిరిలో తిరంగా ర్యాలీ : కందికుంట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18న కూటమి ఆధ్వర్యంలో తిరంగ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం 8 గంటలకు స్థానిక వీఆర్ గ్రాండ్ నుంచి తిరంగ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. నానాదర్గా, కూరగాయల మార్కెట్, ఇక్బాల్‌రోడ్డు, చౌక్, శివాలయం, శివాలయం రోడ్డు, హిందూపురం క్రాస్, టవర్‌క్లాక్, కా లేజీ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, జ్యోతిరావు పూలే సర్కిల్ మీదుగా జీవిమాను సర్కిల్ వరకు ర్యాలీ ఉంటుందని వివరించాన్నారు. ర్యాలీలో నియోజకవర్గ ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. భారత సైనికులు పాకిస్థాన్‌ను తిప్పికొట్టిన సందర్భంగా ఈ విజయోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చె ప్పారు. సమావేశంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

రేపు కళ్లితండాకు మహారాష్ట్ర మంత్రి రాక

పుట్టపర్తిటౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి సంజయ్‌రాథోడ్ ఆదివారం జిల్లా పర్యటనకు రానున్నారని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం ఉదయం బెంగళూరు విమానాశ్రయం నుంచి బయలు దేరి గోరంట్ల మండలంలోని కళ్లితండాకు వచ్చి, అగ్నివీర్ జవాన్ మురళీనాయక్ కుటుంబాన్ని పరామర్శించనున్నారు. అనంతరం పుట్టపర్తి వచ్చి, సత్యసాయి మహాసమాధిని దర్శించుకుని అదేరోజు రాత్రి బెంగళూరు విమానాశ్రయానికి తిరిగి వెళ్లతారు.

నేడు టీడీపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

తనకల్లు, మే16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని మండ్లిపల్లి మిట్టవద్ద ఎస్ఎంఎన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం టీడీపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరవుతారన్నారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ : యువకుడి మృతి



సాయికుమార్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు సాయికుమార్ (26) మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వెంకటగారిపల్లి వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పుట్టపర్తి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు బుక్కపట్నం మండలం జానకంపల్లికి చెందిన అరవ వెంకటన్న, నాగలక్ష్మమ్మ కుమారుడు సాయికుమార్ శుక్రవారం రాత్రి తన స్వగ్రామం జానకంపల్లి నుంచి పెడపల్లి వైపు వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే మృతిచెందాడన్నారు. సాయికుమార్ సీసీకెమెరాలు, డీజే వ్యాపారం చేసుకుని జీవనం సాగించేవాడన్నారు. ఈ క్రమంలో పెడపల్లిలో ఫంక్షన్‌లో డీజే ఏర్పాటు చేశాడన్నారు. ఇందులో భాగంగా జానకంపల్లి నుంచి కొత్తచెరువు మీదుగా పెడపల్లికి వెళుతుండగా వెంకటగారిపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని సంఘటనా స్థలంలోనే సాయికుమార్ మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి తండ్రి అరవ వెంకటన్న ఎనిమిదేళ్ల కిందట అనారోగ్యంతో మరణించడంతో తల్లి నాగలక్ష్మమ్మను కుమారుడే పోషిస్తున్నట్లు తెలిసింది. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లి నాగలక్ష్మమ్మ కన్నీరుమున్నీరయ్యింది. పుట్టపర్తి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పాముదుర్తిలో వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బుక్కపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాముదుర్తి గ్రామంలో శుక్రవారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. హోమియోపతి వైద్యులు గిరీష్, పద్మావతమ్మ ఆధ్వర్యంలో మోకాళ్ల నొప్పులు, వెన్నునొప్పులు, థైయిరాడ్ సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు అందించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రత్యేక చికిత్సలు చేశారు. కార్యక్రమంలోసత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

22న హనుమాన్ శోభాయాత్ర

ధర్మవరం, మే 16(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా ధర్మవరంలో ఈనెల 22న విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర(బైకుర్యాలీ)నిర్వహిస్తామని వీహెచ్‌పీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శోభాయాత్ర లక్ష్మీచెన్నకేశవపురం సర్కిల్‌లోని సీతారామాంజనేయస్వామి ఆలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్, కాలేజ్, కళాజ్యోతి, ఎన్టీఆర్, గాంధీసర్కిల్ మీదుగా తిరిగి ఎన్టీఆర్ సర్కిల్ , అంజుమన్‌సర్కిల్, కదిరిగేటు శివాలయం వరకు సాగుతుందన్నారు.

విద్యుత్ స్తంభం తొలగింపు

'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందన



విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తున్న సిబ్బంది

నల్లచెరువు (కదిరి), మే 16(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వీవర్సుకాలనీలో రోడ్డుకు అడ్డంగా ఉన్నవిద్యుత్ స్తంభాన్ని విద్యుత్ అధికారులు తొలగించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభంతో కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులును ఈనెల 14న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'కనెక్షన్ మార్చారు.. స్తంభం వదిలేశారు' అన్న శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన విద్యుత్ అధికారులు శుక్రవారం రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభాన్ని తొలగించారు.

సమష్టి కృషితో డ్రగ్స్‌కు అడ్డుకట్ట : డీఎస్పీ

పుట్టపర్తిరూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): అందరం సమష్టి కృషితో డ్రగ్స్ పారదోలుదామని డీఎస్పీ విజయ్‌కుమార్ పిలుపినిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సాయిఆరామంలో ఈగల్‌టాస్క్‌ఫోర్సు ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లకు నిర్వహించిన డ్రగ్స్, సైబర్‌నేరాలు, మోసాలు, డ్రగ్స్‌వద్దుబ్రో అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ.. డ్రగ్స్ తీసుకోవడం వలన కలిగే దుష్పరిణామాలను తెలియచేశారు. డ్రగ్స్ తీసుకుని డ్రైవింగ్ చేయడం వలన జరిగే ప్రమాదాలు అనర్థాలను వారికి వివరించారు. గంజాయికి అలవాటు పడి చేజేతులా జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి మత్తులో విచక్షణ కోల్పోయి చిన్నపిల్లలపై అగాయిత్యాలకు పాల్పడుతున్నార్నారు. గంజాయి కట్టడి కోసం రాష్ట్రప్రభుత్వం ఈగల్‌పేరుతో యాంటీడ్రగ్ టాస్క్‌ఫోర్సు ఏర్పాటుచేసిందన్నారు. గంజాయి విస్తరించడంలో కీలకపాత్ర పోషించే పెడ్లర్, ట్రాన్స్‌పోర్టర్స్, కంజూమర్సుపై దృష్టిపెట్టి వాటిని నిర్మూలించడమే ధ్యేయంగా ముందుకెళతామన్నారు. డ్రగ్స్ తీసుకుని డ్రైవింగ్ చేయడం వలన చిన్నపొరపాటుతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కార్యక్రమంలో సీఐలు సునీత,సురేష్, ఈగల్ టీం ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, ఎస్ఐ కృష్ణమూర్తి, సిబ్బంది, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐలు

న్యూస్ బాక్స్

నేటి నుంచి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



విద్యుద్దీపాలంకరణలో లక్ష్మీవెంకటేశ్వరాలయం

పెనుకొండ, మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన పురాతన లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలను 17నుంచి 22వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. వంశపారంపర్య కార్యదర్శి వెచ్చం గుప్త కుమారుడు వెచ్చం అమర్నాథ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం అర్చకులు రామకృష్ణాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, మంగళహారతి, రాత్రి ధ్వజారోహణం శేషవాహనోత్సవం, 18న కళ్యాణోత్సవం, సాయంత్రం గరుడోత్సవం 19న స్వామివారి 119వ బ్రహ్మరథోత్సవం, 20న అశ్వవాహనోత్సవం, 21 గజవాహనోత్సవం, 22న సుప్రభాతసేవ, విశ్వరూపదర్శనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులందరూ పెద్దఎత్తున హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

తుమ్మల మారెమ్మకు ప్రత్యేక పూజలు



గుడిబండ, మే 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తుమ్మల మారెమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

ఉజ్జయిని మహంకాళికి..



పెనుకొండ, మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తోటగేరి వీధిలో వెలసిన పురాతన ఉజ్జయిని మహంకాళి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. బాలారిష్టాలు, తట్టు, అమ్మవారు సోకిన పిల్లలకు అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకుంటారు.

ఎంపీ బీకే ఇంటికి అసెంబ్లీ స్పీకర్..



స్పీకర్ అయ్యన్నపాత్రుడితో చర్చిస్తున్న ఎంపీ బీకే

పెనుకొండ, మే 16(ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు హిందూపురం ఎంపీ బీకే పార్థసారథిని శుక్రవారం కలిశారు. ఎంపీ ఆహ్వానం మేరకు అనంతపురంలోని ఎంపీ ఇంటికి వెళ్లి పార్థసారథిని కలిసి తేనీటి విందు స్వీకరించారు. పలు విషయాల గురించి వారు చర్చించుకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీలో పాల్గొన్న కన్వీనర్ గణేష్

అమరాపురం, మే 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రైతులకు ఏడీ రఘు, ఏఈ సిద్దేశ్వర నూతన ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేసినట్లు మండల కన్వీనర్ గణేష్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు అర్హత కలిగి ఉండి సీనియారిటీ ప్రకారం విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ తాలూకా ఉపాధ్యక్షుడు రామచంద్రప్ప, వాల్మీకి కన్వీనర్ మంజునాథ్, డీలర్ల సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, వలస నాగరాజు, హనుమంతరాయుడు, ఐటీడీపీ మండల అధ్యక్షుడు నింగేగౌడ్, మాజీ సర్పంచ్ హనుమంతరాయ, రామమూర్తి, మాజీ ఎంపీపీ క్రిష్ణమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్ అవార్డుకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మురళీధర్

పరిగి, మే 16(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సత్యసాయిజిల్లా తరఫున ఆరుగురు విద్యార్థులు ఎంపిక కాగా ఇందులో ఐదుగురిని ఏపీఎస్ఆర్ఎస్ కొడిగెనహళ్లికి చెందిన అఫ్రీద్, అహ్మద్‌హుస్సేన్, లక్ష్మీనరసింహారెడ్డి, విశ్వకిరణ్, అశోక్‌లను ఎంపిక చేసి 20న ఉండవల్లిలో రాష్ట్ర ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో నారా లోకేశ్ చేతులమీదుగా అవార్డులు తీసుకోనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్ అవార్డుకు 47మందిని ఎంపిక చేయగా అందులో ఐదుగురు గురుకుల పాఠశాలకు చెందినవారు కావడం గర్వకారణమన్నారు. పాఠశాల సిబ్బంది, ఎస్ఎంసీ సభ్యులు, పూర్వ విద్యార్థులు విద్యార్థులను అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెనుకొండ టౌన్, మే 16(ఆంధ్రజ్యోతి) పట్టణంలో విద్యుత్ మరమ్మతులో భాగంగా ఉదయం 9.30 నుంచి 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నారాయణస్వామి తెలిపారు. కుమ్మరదొడ్డి, చెరువువీధి, తోటగేరి, ఎగువగడ్డ, జీబీసీ కాలనీ, వజ్రాలపేట, దర్గాసర్కిల్, కమాన్ వీధి, కొత్తపేట, గోనిపేట రోడ్డు, బోయగేరి ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తామన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

గుడిబండ, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకల్లు ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న తాగునీటి బోరును మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. బోరు చెడిపోయి నెలలు గడుస్తున్నా సంబంధితశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టి తాగునీటిని అందించాలని కోరుతున్నారు.

సూరప్పకుంట సుందరీకరణకు మోక్షం..!

- ఆరేళ్ల తరువాత కదలిక
- డీపీఆర్ కోసం కన్సల్టెంట్‌కు అప్పగింత
- కుంటను పరిశీలించిన అధికారులు



సూరప్పకుంట చెరువు

హిందూపురం, మే 16(ఆంధ్రజ్యోతి): ఆహ్లాదం కోసం భవిష్యత్‌తరాలను దృష్టిలో ఉంచుకుని పట్టణ నడిబొడ్డున ఉన్న సూరప్పకుంటను నగరవన ఉద్యానయోజన కింద అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సంకల్పించారు. హిందూపురంలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని ఇతర పట్టణాలతో పోలిస్తే ఇక్కడ ఆహ్లాదాన్ని ఇచ్చే ప్రాంతం లేదని ఎమ్మెల్యే భావించి 2019లోనే సూరప్పకుంటను నగరవనం కింద అభివృద్ధి చేసేందుకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం మారడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే దీనిపై దృష్టిసారించారు.

వందెకరాలకుపైగా విస్తీర్ణం

పట్టణం మధ్యలో ఉన్న సూరప్పకుంట వందెకరాలకుపైగా విస్తీర్ణం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఈ చెరువు ఇరిగేషన్‌శాఖలు ఉండగా దానిని అటవీశాఖకు బదిలీ చేశారు. దీంతో నగర వన ఉద్యానయోజనకు మార్గం సుగమమైంది.

ఏర్పాట్లు ఇలా..

నగర వన ఉద్యాన నిర్మాణం పూర్తయితే చెరువు చుట్టూ కట్టనిర్మాణం చేసి చుట్టూ తిరిగేలా తీర్చిదిద్దుతారు. చెరువులోకి నీటిని వదిలి బోటింగ్ సౌకర్యం కల్పిస్తారు. కొన్నిచోట్ల ఉద్యానవనాల ఏర్పాటు చేయనున్నారు. పార్కుల్లో సందర్శకులు కూర్చునేందుకు బెంచీలు, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు, ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేవారికి ఏర్పాట్లు ఉంటాయి. సూరప్పకట్ట మీద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద పార్కు ఏర్పాటు చేస్తారు. దీంతోపాటు చిన్నపిల్లలు ఆడుకునేందుకు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయనున్నారు. 50శాతం గ్రీనరీ ఉండేవిధంగా డీపీఆర్ సిద్ధం చేయనున్నారు. పాదచారుల కోసం టైల్‌స్టోన్ ఏర్పాటుచేస్తారు. మధ్యలో గార్డెనింగ్, చెట్లు, ఫౌంటైన్, ఇతర పనులు చేపట్టనున్నారు. ముఖ్యంగా చెరువుచుట్టూ ప్రహరీ నిర్మించేందుకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నారు.



నమూనాను చూపుతున్న కన్సల్టెంట్ సంస్థ ప్రతినిధులు

సూరప్పకుంట సుందరీకరణకు అడుగులు

2019ఫిబ్రవరి 2న నగరవనం ఉద్యానయోజన హిందూపురం పేరుతో సూరప్పకుంట సుందీకరణకు శంకుస్థాపన చేశారు. అదే యేడాది జరిగిన ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మూలానపడింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే బాలకృష్ణ మరోసారి సూరప్పకుంట అభివృద్ధిపై దృష్టిపెట్టారు. శుక్రవారం జిల్లా అటవీశాఖ అధికారి చక్రపాణి నేతృత్వంలో బెంగళూరుకు చెందిన కన్సల్టెంట్ ప్రతినిధులు వచ్చి మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య, కమిషనర్ శ్రీనివాసులు పరిశీలించారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌ను వెంటనే సిద్ధం చేయాలని కోరారు.

అటవీశాఖ, మునిసిపల్ నిధులకు ప్రయత్నాలు

సూరప్పకుంట సుందరీకరణకు ప్రస్తుతం రూ.15నుంచి రూ.20కోట్ల దాకా ఖర్చవుతుందని అధికారుల అంచనా. అటవీశాఖ నుంచి ఇంత పెద్ద మొత్తం నిధులు వచ్చే అవకాశం ఉండకపోవచ్చు. దీంతో మున్సిపల్ నిధులు, అవసరమైతే అమృత్ పథకం కింద మరికొంత నిధులు వీటితో పాటు మరికొంత నిధులకు పరిశ్రమలను అడిగే అవకాశం ఉంది.

డీపీఆర్ సిద్ధం చేస్తున్నాం
- చక్రపాణి, జిల్లా అటవీశాఖ అధికారి

నగర వన ఉద్యాన యోజనం కింద సూరప్పకుంటను అభివృద్ధి చేసేందుకు బెంగళూరుకు చెందిన కన్సల్టెంట్‌కి డీపీఆర్ కోసం అప్పగించే యోచనలో ఉన్నాం. డీపీఆర్ సిద్ధమైతే ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేస్తే పుర ప్రజలకు ఆహ్లాదకరంగా ఉంటుంది.

బీసీ హాస్టల్‌కు ప్రహరీ నిర్మించండి

అగళి, మే 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌కు ప్రహరీ నిర్మించాలని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. హాస్టళ్ల ప్రారంభించినప్పటి నుంచి ప్రహరీలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. చుట్టుపక్కల ప్రాంతమంతా ముళ్లకంపలు, చెత్తాచెదారంతో నిండిపోయిందన్నారు. అంతేకాక తరచూ ఎలుగుబంట్లు సంచరిస్తుంటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో చర్చించి ప్రహరీ మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. హాస్టల్‌కు మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రహరీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎత్తినహొళె నీటిని చెరువులకు తరలించండి



ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

పావగడ, మే 16(ఆంధ్రజ్యోతి): ఎత్తినహొళె పథకం నుంచి పావగడ తాలూకాలోని 23 చెరువులకు నీటిని తరలించేందుకు నిధులు కేటాయించాలని పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్ప, ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి ఇప్పటికే ఈ నీటి తరలింపు ప్రాజెక్టుపై డీపీఆర్ తయారు చేసేందుకు చిన్నతరహా నీటి పారుదల శాఖ అధికారులకు సూచించినట్లు తెలిపారు. దీనిపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

దొరికిన డబ్బు పోలీసులకు అప్పగింత



పోగొట్టుకున్న సొమ్మును బాధితులకు అందజేస్తున్న విద్యార్థులు

అగళి, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలుడి గ్రామానికి చెందిన విద్యార్థులు నరసింహరాజు, మాలూర అనేవారికి అగళి బస్టాండువద్ద ఒక ప్లాస్టిక్ కవర్లో డబ్బుల బ్యాగు, బ్యాంక్ పాసుపుస్తకం శుక్రవారం దొరికింది. ప్లాస్టిక్‌కవర్‌తోపాటు బ్యాంక్ పాసుపుస్తకాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ బషీర్ చేతికి అందజేశారు. కవర్లో పాసుపుస్తకం పేరుమీద మహాత్మగాంధీ మహిళా సంఘం అనే పేరు గ్యారగుండనహళ్లి గ్రామానికి చెందినదిగా గుర్తించారు. కవర్లో రూ.49,310 ఉన్నాయి. ఆ డబ్బులు మహిళా సంఘ సభ్యులవిగా గుర్తించారు. ఆ వ్యక్తులు రాజమ్మ, శివన్న అన్నవారికి విద్యార్థుల చేతులమీదుగా అందజేశారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

లారీ, మినీ బస్సు ఢీ.. ఒకరికి గాయాలు

సోమందేపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జాతీయరహదారిపై లారీని మినీబస్సు ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు మంత్రాలయం నుంచి తొమ్మిది మంది ప్రయాణికులతో బెంగళూరుకు వెళుతున్న మినీబస్సు సోమందేపల్లి సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ కిరణ్‌కు స్వల్పగాయాలుకాగా ప్రయాణికులు ప్రమాదం నుంచి బయటపడ్డారన్నారు. డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

గుడిబండలో మోస్తరు వర్షం

గుడిబండ, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్లపల్లి, శంకరగల్లు, ఎస్ఆర్ రొప్పం, మైనగానిపల్లి తదితర గ్రామాల్లో గురువారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ



సోమందేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సోమందేపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రపంచ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ ఆయిషా తస్లీం ఆధ్వర్యంలో వైద్యులు ఓంకార్, సిబ్బంది పుర వీధుల్లో ప్రజలకు డెంగీవ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమతెరలు కట్టుకుని దోమ కాటు నుంచి రక్షణ పొందాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను విధిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది మనోహర్‌రెడ్డి, రవీంద్ర, రత్నమ్మ, ప్రభాకర్‌రాజు, అనీల్, గంగమ్మ, ఫరీద, లక్ష్మీదేవి, భూదేవి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పెనుకొండ: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలని యూపీహెచ్‌సీ వైద్యులు రిహానా పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని యూపీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. కోఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గోరంట్ల: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది డెంగీ నివారణపై శుక్రవారం ర్యాలీ చేపట్టారు. మెడికల్ అధికారి శృతి ఆధ్వర్యంలో ఆసుపత్రి నుంచి బస్టాండ్ వరకు ర్యాలీచేశారు. బస్టాండ్‌లో డెంగీ నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారి వివరించారు. వైద్య సిబ్బంది ఆదినారాయణ, రమణ పాల్గొన్నారు.



గోరంట్లలో..

మరమ్మతులు ఏవీ..?

- దెబ్బతిన్న చిత్రావతి, కుషావతి నదుల కాజ్‌వేలు
- పట్టించుకోని అధికారులు

చిలమత్తూరు, మే 16(ఆంధ్రజ్యోతి): రెండు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న కుషావతి, చిత్రావది నదులపై ఉన్న కాజ్‌వేలు దెబ్బతిన్నా వాటిని మరమ్మతు చేసేందుకు అధికారులు చొరవ చూపలేదు. దీంతో నదులపై ఏర్పాటుచేసిన కాజ్‌వే నిర్మాణాలు త్వరలో కురిసే వర్షాలకు మరింత దెబ్బతిని రాకపోకలకు తీవ్ర అంతరాయలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటకలో భారీ వర్షాలు కురవడంతో రెండు సంవత్సరాల క్రితం మండలంలోని చిత్రావతి, కుషావతి నదులు భారీస్థాయిలో ప్రవహించాయి. అందులో భాగంగా సుబ్బరావుపేట వద్ద చిత్రవతి నదిపై ఉన్న కాజ్‌వే పూర్తిగా కోతకు గురైంది. దాంతో అప్పట్లో పది రోజుల పాటు రాకపోకులు బంద్ అయ్యాయి. నీటి ప్రవాహం తగ్గిన తరువాత రాకపోకలు యధావిధిగా కొనసాగాయి. కోడూరు వద్ద కుషావతి నదిపై ఉన్న కాజ్‌వే భారీ నీటి ప్రవాహనికి కొట్టుకుపోయింది. అక్కడ కూడా 15 రోజుల వరకు రాకపోకలు స్తంభించాయి. స్థానిక ప్రజలే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలు సాగిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం దెబ్బతిన్న వంతెనలను పట్టించుకోకపోవడంతో ఇప్పటి వరకు అవి అలాగే ఉండిపోయాయి. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కానుండటంతో చిన్నపాటి వర్షానికి నదుల్లో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉంది. దీంతో తాత్కాలిక మరమ్మతులతో ఉన్న కాజ్‌వేలు మరింత దెబ్బతిని రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. ఈ రెండు నదుల కాజ్‌వేలు దెబ్బతింటే 20 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాజ్‌వేల నిర్మాణాలను చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మరమ్మతుకు నోచుకోని సుబ్బరావుపేట వద్దనున్న చిత్రావతి కాజ్‌వే



మంత్రిని సన్మానిస్తున్న బలిజ కులస్థులు

కాపుల ద్రోహి జగన్: మంత్రి సవిత

పెనుకొండ టౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): కాపుల ద్రోహి వైఎస్ జగన్ అని మంత్రి సవిత అన్నారు. రూ.కోటి నిధులతో సోమందేపల్లి మండలంలో కాపు భవన్ నిర్మిస్తామని మంత్రి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సోమందేపల్లి మండలానికి చెందిన బలిజ కులస్థులు మంత్రిని కలిశారు. అనంతరం పూలమాలలు, శాలువతో సత్కరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికారంలోకి రాగానే బలిజల కోసం భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీ మేరకు భవన నిర్మాణానికి స్థలంతోపాటు భవనాన్ని పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు బలిజ కులస్థులు పాల్గొన్నారు.

బుళ్ళసముద్రంలో కుక్కల బెడద

మడకశిర రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుళ్ళసముద్రం పంచాయతీలో కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామంలో కుక్కలు అధికంగా ఉండడంతో వీధుల్లో ప్రజలు, ఆవులు, గొర్రెలు కనబడితే వారిపై తరచూ దాడులు చేసి గాయపరుస్తున్నాయని వాపోతున్నారు. శుక్రవారం రైతు రంగప్పకు చెందిన ఆవుదూడపై దాడి చేయడంతో మృత్యువాత పడింది. అదే విధంగా రామప్పకు చెందిన రెండు గొర్రెలపై దాడి చేయడంతో అవి మృతిచెందాయని అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలిన గ్రామస్థులు కోరుతున్నారు.

బాలికల వసతి గృహానికి మోక్షమెన్నడో..?



ప్రారంభానికి ఎదురుచూస్తున్న బాలికల వసతి గృహం

సోమందేపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కేజీబీవీ టైప్-5 బాలికల వసతి గృహం నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. వంద మంది పేద విద్యార్థుల కోసం 2019లో 25గదులు నిర్మాణం చేపట్టారు. అప్పట్లో ఆర్ఎంఎస్ఏ నిధుల కింద రూ.1.92కోట్లు మంజూరయ్యాయి. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఐదేళ్ల నిర్లక్ష్యం చేయడంతో నిర్మాణాలు అర్థంతరంగా ఆగిపోయాయి. ఇటీవల కొలువుతీరిన కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టిసారించింది. మంత్రి సవితమ్మ చొరవతో ఆగిన వసతిగృహం నిర్మాణం మళ్లీ పట్టాలెక్కింది. మరమ్మతుల కోసం రూ.31లక్షలు మంజూరు చేయగా శరవేగంగా పనులు చేపట్టి కాంట్రాక్టర్ డీవీ ఆంజనేయులు వసతి గృహాన్ని పూర్తి చేశారు. ప్రహరీ, డోర్లు, కిటికీలు, పైప్‌లైన్ నీటి వసతి తదితర పనులను విద్యాశాఖకు అప్పగించారు. అయితేనిర్మాణం పూర్తయి మూడు నెలలు కావస్తున్నా ప్రారంభం కాలేదు. 2025-26విద్యా సంవత్సరానికి అందుబాటులోకి వస్తే బాగుంటుందని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఆ దిశగా విద్యాశాఖాధికారులు చొరవ చూపాలని పేర్కొంటున్నారు. పాఠశాలలో చదివే విద్యార్థులకు వసతిగృహం అందుబాటులోకి వస్తే మరింత సౌకర్యంగా ఉంటుందని అంటున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం: నాగేంద్రప్రసాద్, హెచ్ఎం

వసతిగృహం నిర్మాణం పూర్తయిందని ఎస్ఎస్ఏకు లేఖ రాశాం. వచ్చే విద్యా సంవత్సరానికి వసతిగృహం ప్రారంభం కావచ్చు. వంద మంది విద్యార్థులకు వసతి కల్పిస్తాం.

పుర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతాం: చైర్మన్

హిందూపురం, మే 16(ఆంధ్రజ్యోతి): హిందూపురం ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు సూరప్పకుంటను సుందరీకరిస్తామని మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య అన్నారు. శుక్రవారం సూరప్ప చెరువుకట్ట ప్రాంతాన్ని వారు పరిశీలించారు. జిల్లా అటవీశాఖ అధికారి చక్రపాణి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, బెంగళూరు కన్సల్టెంట్ ప్రతినిధులు పర్యటించారు. వారు మాట్లాడుతూ 2019లో సుందరీకరణ చేసేందుకు నగర వన ఉద్యానయోజన పేరుతో శంకుస్థాపన చేశారన్నారు. ప్రభుత్వం మారడంతో వైసీపీ వచ్చాక దానిని పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. చెరువు కట్ట ప్రాంతమంతా చదునుచేసి పచ్చదనం, నీటిని నింపి బోటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇతరాత్ర పనుల గురించి బెంగళూరుకు చెందిన కన్సల్టెంట్‌తో డిజిటల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేయమని కోరామన్నారు. అది వచ్చిన వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. పనులు త్వరగా ప్రారంభించేందుకు కృషిచేస్తామన్నారు.

సోమందేపల్లిలో కమెడియన్ శివారెడ్డి



సాయి ఆస్పత్రి నిర్వాహకులతో శివారెడ్డి

సోమందేపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): కళ్లితండాలో వీరజవాన్‌కు నివాళులు అర్పించిన అనంతరం గురువారం తిరుగు ప్రయాణమైన కమెడియన్ శివారెడ్డి సోమందేపల్లిలో సందడి చేశారు. అంబేడ్కర్ సర్కిల్ సమీపంలో ఉన్న సాయి ఆసుపత్రి వద్ద ఆగి స్థానికులను పలకరించారు. ఆసుపత్రి నిర్వాహకులు రఘు, కుటుంబ సభ్యులను కలిసి కాసేపు ముచ్చటించారు. స్థానికులతో కలిసి సెల్ఫీలు దిగారు.

కాంగ్రెస్ పార్టీది ఓటు బ్యాంక్ రాజకీయం



మాట్లాడుతున్న ఎంపీ గోవింద కారజోళ

పావగడ, మే 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీది ఓటు బ్యాంకు కోసమే గ్యారెంటీ పథకాలను అమలు పరిచి ప్రజలను పరోక్షంగా నిలువుదోపిడీ చేస్తోందని చిత్రదుర్గం ఎంపీ గోవింద కారజోళ ఆరోపించారు. శుక్రవారం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అభివృద్ధికి 38వేల కోట్లు బడ్జెట్ అమలు చేసి వాటిలో కేవలం 8వేల కోట్లు మాత్రమే పథకాలకు వినియోగించి మిగిలినవన్నీ గ్యారెంటీ పథకాలకు మళ్లించేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 1960లో నెహ్రూ, ఇందిరాగాంధీ చైనా, పాకిస్థాన్‌లతో యుద్ధాలు జరిపినా నేరుగా ప్రధానమంత్రులే పెత్తనం పోషించే వారన్నారు. పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతికారంగా పాకిస్థాన్ ఉగ్రస్థావరాలపై ఇండియన్ ఆర్మీకి చెందిన సేవ యోధులకే ఆ బాధ్యత అప్పగించి విజయం సాధించిన ఘనత భారత సైనికులకే దక్కడం గర్వకారణమన్నారు. ఈ ఏడాది టెన్త్‌లో అనుకున్న మేరకు ఫలితాలు రాకపోవడం విద్యాశాఖపై విమర్శలకు గురిచేసిందన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు కొరతపై టీహెచ్ఓ డాక్టర్ బాబును అడిగి తెలుసుకున్నారు. అనంతరం తాలూకా పంచాయతీ కార్యాలయంలో ప్రగతి పరిశీలన సభలో పాల్గొని పావగడ అభివృద్ధిపై సంబంధిత అధికారులతో చర్చించారు. బీజేపీ తాలూకా అధ్యక్షుడు అశోక్, రవి, శివకుమార్, సాకెల్, నాగేంద్ర పాల్గొన్నారు.